# ప్రభాత సమాచారం

ఆదిలాబాద్ Digital Edition

https: epaper.prabhathasamacharam.com

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ మంగళవారం | 30 డిసెంబర్ 2025 | ■ 15 పేజీలు


15



అధ్యక్షా.. నా నియోజకవర్గంలో విస్తరించివున్న కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో అటవీ అధికారుల ఆగడాలు మితిమీరిపోయాయి.. ప్రజలను తీవ్రంగా ఇబ్బందులు పెడుతున్నారు.. ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోకుండా పేదలను ఇబ్బంది పెడుతున్నారు.. ప్రతి రోజు నేను జంగ్లాతోల్లాతోనే కొట్లాడాల్సి వస్తుంది అధ్యక్షా.. అంటు ఖానాపూర్ శాసనసభ్యుడు వెడ్మ బొజ్జు పటేల్ సోమవారం అసెంబ్లీలో అటవీ శాఖపై మండి పడ్డారు.

## నా కొట్లాట అంతా జంగ్లాతోల్లాతోనే అధ్యక్షా!

# హృదయ వేదన!

చావు.. పట్టుకలు దైవాదీనం అంటారు. ఏ క్షణాన ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. చావు ఎటువైపు నుంచి ఎలా వస్తుందో కూడా తెలియదు. కొన్ని సంఘటనలు చూస్తే కలో నిజమో అర్థం కాని పరిస్థితి. సెలబ్రిటీల నుంచి సామాన్యుల వరకు ఎవరు ఎప్పుడు ఎలా చనిపోతున్నారో చెప్పలేని పరిస్థితి. వయసుతో సంబంధం లేకుండా ముంచుకొస్తున్న కార్డియాక్ అరెస్ట్.. ప్రాణాల్ని బలితీసుకుంటోంది. గుండెపోటుతో ఎవరైనా మరణించారు అనే వార్త వినగానే చాలా మందిలో కలవరం మొదలవుతోంది. ఎవరికైనా గుండెపోటు వచ్చిందంటే చాలు.. తమకూ ఏదో అయిపోతుందని ఆస్పత్రి బాట పడుతున్నారు. ఊబకాయం, గతంలో ఉన్న శారీరక శ్రమ లేకపోవడం, గ్యాస్ ట్రబుల్ వంటి సమస్యలు ఎక్కువ మందిలో ఆందోళనకు కారణమవుతోంది. ఆహార నియమాలను పాటిస్తూ.. వైద్య సలహాలు పాటిస్తే.. ఎలాంటి సమస్య ఉండబోదని వైద్యులు చెబుతున్నారు.

■ ప్రభాత సమాచారం
ఆదిలాబాద్

## భయపెడుతున్న.. గుండెపోట్లు..

- 40 ఏళ్లు దాటిన ప్రతీ ఒక్కరిలోనూ ఆందోళన
- గ్యాస్ ట్రబుల్ సమస్యనూ హార్ట్ ఎటాక్‌గా భావిస్తున్న వైనం..
- మరణ వార్తలు విన్న వెంటనే డాక్టర్ల చెంతకు..
- సరైన వ్యాయామం లేకపోవడంతో అనారోగ్య సమస్యలు
- రోజు రోజుకూ పెరుగుతున్న ఆధునిక వైద్య సదుపాయాలు
- ఆందోళన వద్దంటున్న వైద్యులు.. గుండె జబ్బులకు వైద్యం ఉందని భరోసా

11 లో

లయ తప్పుతున్న లబ్‌డబ్

14



## ‘ముక్కోటి’కి ఆలయాల ముస్తాబు

■ ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు ■ భక్తుల రద్దీ దృష్ట్యా బారికేడ్ల ఏర్పాటు

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాలోని వైష్ణవ ఆలయాలు ముస్తాబయ్యాయి. భక్తుల ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంచిర్యాలలోని విశ్వనాథ స్వామి ఆలయ ప్రాంగణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ధనుర్మాస ఉత్సవాల్లో స్వామివారికి పూజా కైంకర్యాలు ఏకాంతంగా నిర్వహించిన అనంతరం మంగళ వారం వేకువజామున ఐదు గంటల నుంచి వేంకటేశ్వరుడి ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు.

## చలించిపోతున్నారు

■ గిన్నెదరిలో అత్యల్పంగా 6.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు

ఈశాన్య ప్రాంతం నుంచి వీస్తున్న శీతలగాలులతో ఏజెన్సీ వణుకుంతోంది.. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఆరేడు డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి.. పగటిపూట కూడా చలి ఇంటా.. బయట పంజా విసురుతోంది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా గిన్నెదరి ప్రాంతంలో సోమవారం ఉదయం కనిష్టంగా 6.1డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం.



## పోలీసుల పట్ల విశ్వాసం పెరిగింది

10




■ జిల్లాలో నేరాలపై పోలీసుల ఉక్కుపాదం
■ ఆదిలాబాద్ జిల్లాలో తగ్గిన క్రైం రేట్..
■ గంజాయి నిర్మూలనే లక్ష్యంగా ముందుకు
■ నేర రహిత సమాజం దిశగా చర్యలు
■ ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
■ జిల్లా వార్షిక క్రైం రిపోర్ట్ విడుదల

ఆదిలాబాద్ జిల్లాలో గత ఏడాది కంటే ఈ ఏడాది నేరాల శాతం గణనీయంగా తగ్గిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ స్పష్టం చేశారు. సోమవారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లా వార్షిక క్రైం నివేదిక విడుదల చేశారు. పాఠశాలలో, కళాశాలలో విద్యార్థులచే యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి పకడ్బందీగా పర్యవేక్షిస్తామన్నారు. గంజాయి నిర్మూలనే పోలీసుల లక్ష్యమని స్పష్టం చేశారు.

# జిల్లాలో యూరియా కొరత లేదు

- యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి..
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- వీసీలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు






**మంచిర్యాల, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)** రాష్ట్రంలో వ్యవసాయ సాగుకు అవసరమైన యూరియా సమృద్ధిగా అందుబాటులో ఉందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సభ్యసాచి గోష్, రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి కె.సురేంద్రమోహన్ లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వ్యవసాయ, సహకార, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ సాగుకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని, కార్యచరణ ప్రకారం ప్రణాళికాబద్ధంగా రైతులకు పంపిణీ చేయాలని తెలిపారు. ఇందు కొరకు ప్రభుత్వం యూరియా యాప్ రూపొందించి రైతులకు అందుబాటులో ఉంచిందని, పైలట్ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలోని పెద్దపల్లి, నల్గొండ, జనగామ, ఆదిలాబాద్, మహబూబ్ నగర్ జిల్లాలను ఎంపిక చేసి మొదటగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఆయా జిల్లాలలో అమలవుతున్న యాప్ నిర్వహణపై జిల్లాల కలెక్టర్లు, అధికారులనువివరాలుఅడిగి తెలుసుకుని యాప్‌పై రైతుల అభిప్రాయం తెలుసుకోవాలని సూచించారు. యూరియా పంపిణీ కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నీడ, త్రాగునీరు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. యూరియా పంపిణీ పై ప్రత్యేక అధికారులను నియమించి యూరియా సరఫరాలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. రైతుల సౌకర్యార్థం రాష్ట్రస్థాయిలో టోల్ ఫ్రీ నంబర్ 1800 599 5770 ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లా స్థాయిలో హెల్ప్ లైన్ నంబర్ ఏర్పాటు చేయాలని, యూరియా పంపిణీ, రవాణాపై టాస్క్ ఫోర్స్ బృందాన్ని నియమించి, యూరియా తప్పు త్రోవ పట్టకుండా పర్యవేక్షించాలని తెలిపారు. యూరియా పంపిణీ సమయంలో పట్టాదారు పాసుపుస్తకంలో నమోదైన భూ విస్తీర్ణం ప్రకారం అవసరమైన యూరియా సంబంధిత రైతుకు అందించాలని, అవసరానికి మించి యూరియా పంపిణీ చేయవద్దని సూచించారు. వ్యవసాయ శాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో యూరియా నిల్వలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, యూరియా యాప్ ద్వారా ఆన్ లైన్ మాత్రమే కాకుండా ఆఫ్‌లైన్‌లో పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ప్రతి రోజు రైతులకు పంపిణీ చేసిన వివరాలతో పాటు మిగిలి ఉన్న నిల్వలను పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. యూరియా పంపిణీ కేంద్రాలలో ప్రతిరోజు ఉదయం 6 గంటలకు పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలని, యూరియా పంపిణీపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలోని రైతులకు వ్యవసాయ సాగు కొరకు యూరియా పంపిణీ చేయాలని, టి - పాస్‌లో వివరాలు స్పష్టంగా ఉండాలని, ఎలాంటి అవకతవకలకు అవకాశం ఇవ్వకూడదని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కలుపుకుని జిల్లాలో 362 దుకాణాల ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 3 వేల 534 మెట్రిక్ టన్నుల యూరియా ఉండగా ఇందులో సొసైటీలలో 404 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల వద్ద 763 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని తెలిపారు. మార్క్ ఫెడ్ బఫర్ 1 వేయి 832 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, జిల్లాలో అవసరం ఉన్న ప్రాంతాలకు యూరియా పంపించడం జరుగుతుందన్నారు.

# ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేయాలి



**ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)** సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజా ఫిర్యా దు కార్యక్రమాన్ని సోమవారం ఎస్పీ అఖిల్ మహాజన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి ప్రజలు జిల్లా ఎస్పీని నేరుగా కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. సమస్యలను విన్న జిల్లా ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలిచ్చి బాధితుల సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రతి ఒక్క సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి శాశ్వతంగా పరిష్కారం చూపాలని ఆదేశాలు ఇచ్చారు. ఈరోజు పోలీసు ముఖ్య కార్యాలయంలో దాదాపు 38 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. సమస్యలను విన్నవించుకున్న వారిలో భూ సమస్యలు, ఫోర్జరీ సమస్యలు, అన్నదమ్ముల కుటుంబ తగాదాలు, వివిధ కేసుల కు సంబంధించిన ఫిర్యాదులను జిల్లా ఎస్పీ గారికి ప్రజలు నేరుగా తెలియజేశారు. సుదూర ప్రాంతాల ప్రజలు జిల్లా ఎస్పీ గారికి సమాచారం అందించాలన్న సమస్యలను విన్నవించాలన్న మెసేజ్ యువర్ ఎస్పీ అనే కార్యక్రమం ద్వారా ప్రారంభించబడిన 8712659973 నెంబర్ కు వాట్సప్ ద్వారా సమాచారం కానీ ఫిర్యాదులను కానీ తెలియజేయవచని సూచించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఐపిఎస్ రాహుల్ పంత్, సిసి కొండ రాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది వామన్ తదితరులు పాల్గొన్నారు.



# డీజేలకునో పర్మిషన్

## రేసింగ్‌లు చేస్తే క్రిమినల్ కేసులు..

## మద్యం తాగి వాహనం నడిపితే అంతే

**మందమర్రి, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)** ఎస్ఐ రాజశేఖర్ మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో గల ప్రజలకు ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ నూతన సంవత్సర వేడుకల పేరుతో అతిగా ప్రవర్తించినా, నిబంధనలు అతిక్రమించిన చట్టపరమైన చర్యలు తప్పవని గట్టి హెచ్చరిక చేశారు. డిసెంబర్ 31 రాత్రి పట్టణంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్ శాఖ పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తుందని ఆయన తెలిపారు. ముఖ్యంగా యువత ఉత్సాహం పేరుతో చేసే విన్యాసాలు ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. డిసెంబర్ 31 సాయంత్రం నుంచే పట్టణంలోని ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద నిరంతర డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని ఎస్సై స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనం నడిపినట్లు తేలితే ఏ మాత్రం ఉపేక్షించకుండా అక్కడికక్కడే వాహనాలను జప్తు చేస్తామని, డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు చేయాలని రవాణా శాఖకు సిఫార్సు చేస్తామని పేర్కొన్నారు. పట్టణ పరిధిలో ఎటువంటి డీజే సౌండ్ సిస్టమ్స్‌కు అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. అధిక శబ్దాలతో ఇరుగుపొరుగు వారికి, వృద్ధులకు, రోగులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన కేసులు నమోదు చేస్తామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో, రహదారుల పైన మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిని వెంటనే అదుపులోకి తీసుకుంటామని హెచ్చరించారు. యువత బైక్‌లపై రేసింగ్‌లు చేయడం, సైలెన్సర్లు తొలగించి అతి వేగంగా ప్రయాణించడం వంటివి చేస్తే వాహనాలు సీజ్ చేయడంతో పాటు వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు. న్యూ ఇయర్ వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు.

# భూ సమస్యలను పరిష్కరించండి

**బెజ్జూర్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)** మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ సరోజ సోమవారం తహసీల్దార్ రామ్మోహన్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీలోని భూ సమస్యలపై మాట్లాడిన ఆమె ప్రజలకు ధ్రువపత్రాలు ఇతర సమస్యలను పరిష్కరించవలసిందిగా విజ్ఞప్తి చేసిన ఆమె తహసీల్దార్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సర్పంచుకు తాసిల్దార్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



## జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లకు

# ఇసుక కొరత లేదు

## కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)** జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ఇసుక, ఇటుక, ఇతర ముడి సామగ్రి కొరత లేదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం స్పష్టం చేశారు. ఇండ్ల నిర్మాణానికి అవసరమైన సామగ్రి తగినంత నిల్వ ఉందని, ఈ విషయంలో లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి వినియోగించే ఇసుక, ఇటుకల విషయంలో ఎవరైనా ఉద్దేశపూర్వకంగా కృత్రిమ కొరత సృష్టించినా, అక్రమాలకు పాల్పడినా వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. లబ్ధిదారులు ఇసుక, ఇటుక కొరతకు సంబంధించి వస్తున్న తప్పుడు వార్తలను నమ్మవద్దని సూచించారు. ఎటువంటి సందేహాలకు తావు లేకుండా తమ ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని కలెక్టర్ లబ్ధిదారులను కోరారు.

# రేషన్ షాపు అందుబాటులో లేక గ్రామస్తుల అవస్థలు

**కాగజ్‌నగర్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)** కాగజ్‌నగర్ మండలం దుర్గానగర్ విలేజ్ నంబర్ 10లో రేషన్ దుకాణం లేక నానా అవస్థలు పడుతున్నా మని ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు (400) నాలుగు వందల కుటుంబాలు నివాసిస్తున్నాయని తమకు స్థానికంగా రేషన్ దుకాణం లేకపోవడంతో ప్రతి నెల రేషన్ సరుకులు సకాలంలో పొందలేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. గ్రామంలో చాలా మంది వృద్ధులు ఉన్నారని ప్రతి నెల రేషన్ సరుకులు తీసుకోవడానికి పక్క గ్రామమైన విలేజ్ నంబరు 5 లేదా 9 గ్రామాల్లో ఉన్న రేషన్ దుకాణాలకు సుమారు 3 నుంచి 4 కిలో మీటర్ల దూరం కాలి నడకన వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. కనీసం తమ సమస్యను చెప్పుకునేందుకు అధికారుల వద్దకు కూడా వెళ్లలేని పరిస్థితుల్లో గ్రామంలో ఉన్నామని సంబంధిత అధికారులు గ్రామంలోనే చౌకధరల దుకాణాన్ని ఏర్పాటు చేయాలని వారు కోరారు.



# రైతులక అందుబాటులో యూరియా





- యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి..
- నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్
- అవసరం మేరకు యూరియాను అందించాలి
- వీసీలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**నిర్మల్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
రాష్ట్రంలో ప్రతి రైతుకు పంటకు సరిపడినంత యూరియా తప్పనిసరిగా అందించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో యూరియా పంపిణీపై వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎక్కడ కూడా యూరియా కొరత లేదని స్పష్టం చేశారు. రైతులు పండించబోయే యాసంగి పంటకు సంబంధించి అవసరమైనంత మేరకు యూరియా అందుబాటులో ఉందని వివరించారు. రైతులకు యూరియా పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు ఉండకూడదని పేర్కొన్నారు. అతి త్వరలోనే అన్ని జిల్లాలలో యూరియా బుకింగ్ కోసం, ఫర్టిలైజర్ బుకింగ్ అప్లికేషన్ అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. రైతులు, ఎరువుల కొరత అంటూ వస్తున్న పుకార్లను నమ్మవద్దని సూచించారు. ఎరువుల కృత్రిమ సృష్టించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోజువారీగా యూరియా అమ్మకాలకు సంబంధించి ప్రారంభ నిల్వ, ముగింపు నిల్వ వివరాలను తమకు అందజేయాలని చెప్పారు. ఇక నుంచి ఉదయం ఏడు గంటలకు కాకుండా, ఆరు గంటల నుంచే రైతులకు యూరియా అమ్మకాలు ప్రారంభించాలని చెప్పారు. యూరియా కొనుగోలుకు వచ్చిన రైతులకు ఇబ్బందులు కలగకుండా టెంటు, తాగునీరు తదితర వసతులు కల్పించాలని అన్నారు. యూరియా పంపిణీలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్న రాష్ట్రస్థాయి హెల్ప్ లైన్ నంబరు 18005995779ను సంప్రదించవచ్చునని మంత్రి తెలిపారు. జిల్లా స్థాయిలో హెల్ప్ లైన్ నంబర్ ఏర్పాటు చేయాలని, యూరియా పంపిణీ, రవాణాపై టాస్క్ ఫోర్స్ బృందాన్ని నియమించి, యూరియా తప్పు త్రోవ పట్టకుండా పర్యవేక్షిం చాలని తెలిపారు. యూరియా పంపిణీ సమయంలో పట్టాదా రు పాసుపుస్తకంలో నమోదైన భూ విస్తీర్ణం ప్రకారం అవసరమైన యూరియా సంబంధిత రైతుకు అందించాలని, అవసరానికి మించి యూరియా పంపిణీ చేయవద్దని సూచిం చారు. వ్యవసాయ శాఖ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి మాట్లాడు తూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో యూరియా నిల్వలు సమృ ద్ధిగా అందుబాటులో ఉన్నాయని, యూరియా యాప్ ద్వారా ఆన్ లైన్ మాత్రమే కాకుండా ఆఫ్‌లైన్‌లో పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకు అవస రమైన యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ప్రతి రోజు రైతులకు పంపిణీ చేసిన వివరాలతో పాటు మిగిలి ఉన్న నిల్వలను పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కడా కూడా యూరియా కొరత లేదని తెలిపారు. అందుబాటులో ఉన్న యూరియా మొత్తాన్ని, రైతుల అవసరాల మేరకు పకడ్బందీగా పంపిణీ చేయాలని సూచించారు. అవసరమైనంత యూరియా అందుబాటులో ఉందని, యూరియా కొరత అంటూ వస్తున్న పుకార్లను నమ్మవద్దని రైతులకు సూచించారు. యూరియా పంపిణీ విషయంపై రైతులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని అన్నారు. మండల స్థాయి వ్యవసాయ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు యూరియా పంపిణీ ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించాలని తెలిపారు. ఖచ్చితంగా ఉదయం ఆరు గంటల నుంచి యూరియా అమ్మకాలు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, ఉద్యానవన పంటల అధికారి రమణ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి సమస్యలను త్వరగా పరిష్కరించాలి



- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ పదీక్



**మంచిర్యాల, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అర్జీదారాల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల మండలం మైలారం గ్రామానికి చెందిన దండ నాయకుల విజయలక్ష్మి తన భర్త చనిపోయారని, మరణ ధ్రువీకరణ పత్రం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కోటపల్లి మండలం పారుపల్లి గ్రామానికి చెందిన భోగే రాజేశ్వరి తన భర్త మరణించినందున సంబంధిత కుటుంబ సభ్యుల దృవపత్రాన్ని ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జన్నారం మండలం మురిమడుగు గ్రామానికి చెందిన సంధ్యవేణి నడిపి రాజం తాను కొనుగోలు చేసిన భూమి నిషేధిత జాబితాలో ఉందని, తొలగించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జిల్లాలోని పోచంపాడు గ్రామస్తులు తమ గ్రామ శివారులోని హద్దుల సమస్యలు, విచారణ చేసి పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. నస్పూర్ మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన మంద ఇసయ్య తనను, తన భార్యను ఇంటి నుండి వెళ్లగొట్టిన తన చిన్న కొడుకు, కోడలు వేధింపుల నుండి కాపాడి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# టీజీ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

- ~~ఫిబ్రవరి 22న ప్రవేశ పరీక్ష~~
- ~~ప్రిన్సిపాల్ వూటూరి సంతోష్ కుమార్~~

**బెల్లంపల్లి, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ రాష్ట్ర సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2026-27 విద్య సంవత్సరానికి 5, 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రవేశాలకు తెలంగాణ ప్రభుత్వం ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టిజిసెట్) దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వూటూరి సంతోష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 11వ తేదీ నుండి జనవరి 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఫీజు రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 22న జరుగుతుందని తెలిపారు. 21వ శతాబ్దం గురుకులాల్లో నాణ్యమైన విద్యతోపాటు ఉచిత దుస్తులు, పుస్తకాలు, సన్న బియ్యంతో కూడిన పోషకమైన, రుచికరమైన సమతుల్య ఆహారం, హాస్టల్ సౌకర్యం, నెలవారి కాస్మెటిక్ చార్జీలు బ్యాంకుల ద్వారా చెల్లించబడుతున్నవని తెలిపారు. విద్య విషయక అంశాలతో పాటు సమానంగా సహపాఠ్య కార్యకలాపాలు ఆటలు, క్రీడలు, కోడింగ్, లలిత కళలు, గ్రంధాలయ సౌకర్యం మొదలైన వాటిపై ప్రత్యేక దృష్టి ఉంటుందన్నారు. క్రీడల్లో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించి శిక్షణ ఇస్తామనీ పేర్కొన్నారు. గురుకులాల్లో సమర్థవంతమైన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే బోధన, నిరంతర పర్యవేక్షణ, ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ అన్ని ప్రభుత్వ పరీక్షల్లో అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధిస్తున్నాని వెల్లడించారు.



## ఏఎస్పీని సన్మానించిన పెన్షనర్ ఉద్యోగులు

**నిర్మల్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పత్తిపాటి సాయికుమార్‌కు సోమవారం నిర్మల్ జిల్లా పెన్షన్ల సంఘం అధ్యక్షులు లింగన్న ఆధ్వర్యంలో కలిసి సన్మానం చేశారు. పూల బొకేలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కిసాన్ విలాస్ పోతన్న గోపీచంద్ కిషోర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దు

- కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు
- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో యూరియా కొరత ఏమాత్రం లేదని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. యూరియా నిల్వలు, సరఫరా తీరుపై అధికారులతో సమీక్షించిన అనంతరం సోమవారం కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం రైతుల అవసరాలకు అనుగుణంగా 8 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొందరు వ్యాపారులు, దళారులు కృత్రిమ కొరత సృష్టించి, అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను భయాందోళనకు గురిచేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. యూరియా విక్రయ కేంద్రాల వద్ద అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. రైతులు దళారుల మాటలు నమ్మి అధిక ధరలకు యూరియా కొనుగోలు చేయవద్దని, రైతులు తమ అవసరాలకు తగ్గట్టుగా మాత్రమే యూరియాను కొనుగోలు చేయాలన్నారు. ఎక్కడైనా కృత్రిమ కొరత సృష్టించినా లేదా అధిక ధరలకు విక్రయించినా వ్యవసాయ శాఖ అధికారులకు లేదా కలెక్టరేట్ కార్యాలయానికి ఫిర్యాదు చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## నూతన సంవత్సర వేడుకలను
# ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

- ప్రత్యేకంగా 15 డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్‌పోస్టులు
- డీజేలకు అనుమతులు లేవు
- నిబంధనలకు లోబడి వ్యవహరించాలి
- ట్రిపుల్ రైడింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్ చేసిన వాహనాల సీజ్ చేయడంతో పాటు కేసులు
- పోలీసు అనుమతులు లేనిదే స్పీకర్లను, సౌండ్ బాక్సులను ఏర్పాటు చేయవద్దు..
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
జిల్లావ్యాప్తంగా 31 డిసెంబర్ రాత్రి వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు, ప్రజలు పోలీసులు సూచించినటువంటి సూచనలను పాటించాలని ఒక ప్రకటన ద్వారా తెలియ జేశారు. 31 రాత్రి మరియు నూతన సంవత్సరం సందర్భంగా యువత ప్రశాంత వాతావరణంలో నిబంధనలకు లోబడి వేడుకలను నిర్వహించుకోవాలని, ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా వేడుకలు నిర్వహణ చేపట్టాలని తెలిపారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా జిల్లా పోలీసు వ్యవస్థ పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 30 డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్లు, ముఖ్యంగా పట్టణంలో 15 చెక్పోస్టులను ఏర్పాటు చేసి డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వారి వాహనాలు సీజ్ చేస్తూ, వారిపై చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. వాహనదారులు రాంగ్ సైడ్ డ్రైవింగ్, రేష్ డ్రైవింగ్, స్పీడ్ రేసింగ్ లాంటివి చట్ట విరుద్ధమని తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపినట్లు అయితే వారిపై మరియు వారి తల్లిదండ్రులపై కేసులు తప్పవని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలకు అనుమతులు లేవని, నూతన సంవత్సరం సందర్భంగా రోడ్లపై కేక్ కటింగ్ లు చేస్తూ ఉన్న వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇళ్లపై సౌండ్ బాక్స్ లతో, మైక్ సిస్టంలతో వేడుకలను నిర్వహించేవారు కచ్చితంగా పోలీస్ అనుమతులను తీసుకోవాల్సిందని సూచించారు. అనుమతులు లేనిదే ర్యాలీలు, సభలు, సమావేశాలు, ఈవెంట్లు, ప్రోగ్రాములను నిర్వహించరాదని, జిల్లావ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని తెలిపారు. ఎలాంటి ప్రైవేటు ఈవెంట్లను నిర్వహించాలన్న వారు ఎక్సైజ్ శాఖ పోలీస్ శాఖ అనుమతులను తీసుకోవాలని తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో టపాకాయలు వెలిగించరాదని తెలిపారు. యువత నిబంధనలకు లోబడి వ్యవహరించాలని పట్టణాల్లో రేసింగ్ లో చేస్తూ పట్టుబడితే పోలీసు చర్యలు తప్పవన్నారు. ప్రతి మండల పరిధిలో ఒకే విధమైన నిబంధనలు ఉంటాయని తెలిపారు.

# ప్రజావాణి అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలి



ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షి షా

**ఆదిలాబాద్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సత్వరంగా, క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజార్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును శాఖల వారీగా పరిశీలించి, సకాలంలో పరిష్కరించాలని సూచించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ఉపాధి, భూభారతి తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 110 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుని, దరఖాస్తుదారులకు పురోగతి వివరాలు తెలియజేయాలని ఆదేశించారు. అదేవిధంగా మండల ప్రత్యేక అధికారులు తమ మండలాల్లోని పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా నిరంతరం విద్యా సంస్థలను పర్యవేక్షించాలని, ఆ నివేదికలను ప్రతి వారం సమర్పించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం డిప్యూటీ సెక్రటరీగా పదోన్నతి పొందిన సందర్భంగా జిల్లా కలెక్టర్‌ను అధికారులు శాలువాతో సన్మానించి, మొక్కను అందజేశారు. అనంతరం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాల ఫ్లెక్సీని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి రాజేశ్వర్, డీఆర్‌డీఓ రవీందర్ పాల్గొన్నారు.



# సీఐ,ఎస్ఐకి రివార్డు

**వాంకిడి, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
గంజాయి మొక్కలు పట్టుకున్న కేసులలో వాంకిడి స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిఐ సత్యనారాయణ, ఎస్సై మహేందర్‌ను సోమవారం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ అభినందించి, రివార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పై మాట్లాడుతూ... మండలంలో గంజాయి మొక్కలు, ఎండు గంజాయి విక్రేతలపై కేసులు నమోదు చేసి మాదక ద్రవ్యాల కట్టడిలో ప్రత్యేక్క పాత్ర పోషించి, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతిభ కనబరి చినందుకు ఎస్పీ అభినందించి రివార్డు అందజేసినట్లు ఆయన తెలిపారు.

## మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

**భీంపూర్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
మద్యానికి బానిసై కుటుంబ భారాన్ని భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన భీంపూర్ మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్లి గ్రామానికి చెందిన కౌడల నాగన్న (42) మంగళవారం ఉదయం గ్రామ శివారులో జాలిపెల్లి మహేష్ వ్యవసాయ పొలం సమీపంలోని టేకు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం గమనించిన కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని వెంటనే భీంపూర్ పోలీసులకు సమాచారం అందించారు. ప్రాథమిక విచారణలో నాగన్న మద్యానికి బానిసై, కుటుంబ పోషణ కష్టంగా మారడం వల్ల మానసిక ఒత్తిడికి గురై మద్యం మత్తులోనే ప్రాణాలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సంఘటనపై ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబసభ్యులు పేర్కొన్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తామన్నారు.

## బీసీల న్యాయమైన డిమాండ్లను
# పరిష్కరించాలని నిరసన

**మంచిర్యాల, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర ప్రభుత్వం బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి పట్టణంలోని ఐబి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీ ఫెడరేషన్లకు పాలకమండళ్లను ఏర్పాటుచేసి నిధులు విడుదల చేయాలని, నామినేటెడ్ పదవులలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేయాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో విడుదల చేయాలని, ఎంబీసీ మంత్రిత్వ శాఖను, సంచారక కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలని కోరారు. కొత్తగా ఏర్పాటుచేసిన కార్పొరేషన్లకు ఒక్కొక్క కార్పొరేషన్‌కు రెండు వేల కోట్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో బీసీల డిమాండ్లపై చర్చ పెట్టి ఆ డిమాండ్ల పరిష్కారం దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు వెంకటయ్య, శాఖపూరి భీమ్సేన్, ధర్మాజీ మల్లేష్, రాజేశం, బిక్షపతి, సతీష్, బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు సదానందం, నటేశ్వర్, రామగిరి రాజన్న తదితరులు పాల్గొన్నారు.



# ఏబీవీపీ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ల ఆవిష్కరణ




**మంచిర్యాల, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ 44వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను మంచిర్యాలలోని ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపల్ ఐత శ్రీనివాస్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా వ్యవస్థ ప్రముఖ చెట్టి శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ లావుడ్య అనిల్ కుమార్ మాట్లాడుతూ ఏబీవీపీ 44 వ రాష్ట్ర మహాసభలు జనవరి 3,4,5 తేదీలలో శంషాబాద్‌లో జరుగుతాయని తెలిపారు. ఈ మహాసభలకు త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి ముఖ్య అతిథిగా, అఖిలభారత సంఘటన కార్యదర్శి ఆశిష్ చౌహాన్ విశిష్ట అతిథిగా, ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షులు జానా రెడ్డి, ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వెయ్యి మంది హాజరవుతారని వివరించారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి



**నిర్మల్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను అదనపు కలెక్టర్‌కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం అదనపు కలెక్టర్, అధికారులు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2026– 27 విద్యా సంవత్సరానికి సంబంధించి, ఉమ్మడి ప్రవేశ పరీక్షల నిర్వహణ గోడ ప్రతులను ఆవిష్కరించారు. 'మీ డబ్బు మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా వివిధ జిల్లా శాఖలకు సంబంధించి నూతనంగా కేవైసీ ప్రక్రియ పూర్తి చేసి, ఆక్టివేట్ చేసిన నూతన బ్యాంకు ఖాతాలను ఎల్డీఎం రామ్ గోపాల్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులకు అందజేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ ప్రాసెసింగ్, సంఘాలకు ప్రోత్సాహం అందించాలి

## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా






**ఆదిలాబాద్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో బ్యాంకులు కీలక పాత్ర పోషించాలని, ముఖ్యంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, స్వయం సహాయక సంఘాలకు నూతన తరహా రుణాలు అందించడంపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా బ్యాంకర్లకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కన్సల్టేటివ్ కమిటీ సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ సంవత్సరం సెప్టెంబర్ 2025 మాసంతం వరకు ప్రాధాన్యత రంగాల అడ్వాన్సుల కింద రూ. 4508.78 కోట్లు, వ్యవసాయ రంగం అడ్వాన్సుల కింద రూ. 3347.65 కోట్లు ఉన్నయని అన్నారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకంపై ప్రజలకు, రైతులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులు, వీధి వ్యాపారులకు బ్యాంకులు అధికంగా ఆర్థిక సహాయం అందించి వారిని ప్రోత్సహించాలని సూచించారు. పీఎంఈజీపి, పీఎం విశ్వకర్మ వంటి పథకాల పురోగతిపై అధికారులతో సమీక్షిస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ఈ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లలో కొత్త తరహాలోన్లు ఇవ్వాలని, అలాగే మహిళా స్వయం సహాయక సంఘాలకు వినూత్నమైన నూతన ఆవిష్కరణ ప్రాజెక్టుల కోసం రుణాలు మంజూరు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్.బి.ఐ ఏ.జి.ఎం గోమతి, ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఉత్పల్ కుమార్, నాబార్డ్, వివిధ బ్యాంకుల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

---



## మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

# కూతురు అంత్యక్రియలు

**ముథోల్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
ముథోల్ మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి కూతురు సులోచన గుండెపోటుతో మృతి చెందగా ఆదివారం ఆమె అంత్యక్రియలు భైంసా మండలంలోని దేగాం గ్రామంలో నిర్వహించారు. ముదురు నియోజకవర్గంలో ఆరుసార్లు విజయం సాధించిన మాజీ మంత్రి స్వర్గీయ గడ్డన్న, కుటుంబీకులు రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించిన విట్టల్ రెడ్డి కూతురు కావడంతో పెద్ద ముత్తల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తరలివచ్చారు పిట్టల రెడ్డికి పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు వెద్మ బొజ్జు పటేల్, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, రాష్ట్ర మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి, రాజకీయ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంతాపాన్ని ప్రకటించారు.

## బాధిత కుటుంబాలను

# పరామర్శించిన మాజీ మంత్రి

**నిర్మల్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ పట్టణంలోని వివిధ వార్డులోని కాంగ్రెస్ పార్టీ నాయకులను మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సోమవారం పరామర్శించారు. పట్టణంలోని శాస్త్రి నగర్ ఆదర్శనగర్ బుధవార్‌పేట్ గొల్లపేట్ ప్రియదర్శ నగర్ కాలనీలో అనారోగ్యం గురై ఆస్పత్రిలో చికిత్స చికిత్స పొందిన బాధితులతో పాటు మరణించిన కుటుంబ సభ్యులను పరామర్శించారు.



---

## కేస్లాపూర్‌లో జరిగే నాగోబా జాతర విధుల్లో

# 108 సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



**ఇంద్రవెల్లి, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
నాగోబా జాతర విధుల్లో 108 సిబ్బంది అప్రమత్తంగా ఉండి, ప్రజలకు అత్యవసర సేవలను అందించేందుకు సిద్ధంగా ఉండాలని ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్,జిల్లా కో ఆర్డినేటర్ రాజశేఖర్ అన్నారు.సోమవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 108సిబ్బందితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా ప్రోగ్రాం మేనేజర్ మాట్లాడారు.జనవరి 18నుండి నాగోబా జాతర ప్రారంభం కానున్నదని, జాతరలో వచ్చే భక్తులకు ఆరోగ్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని సిబ్బందికి దిశా నిర్దేశం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, విజయ్, బాపురావు, నామ్ దేవ్ స్టాఫ్ నర్స్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

---

# రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బహిరంగ సభ



**జన్నారం, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
జనవరి 3 తేదీన చలో హైదరాబాద్ కుదుబుల్లాపూర్ మున్సిపాలిటీ గ్రౌండ్‌లో సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవమ్ సందర్భంగా 42 శాతం బిసి రిజర్వేషన్ సాధనకై ఆర్ పి ఐ రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా భీమ్‌రావు అంబేద్కర్ ఆధ్వర్యంలో జరుగుతుంది ఈ బహిరంగ సభకు ఏపీ టీఎస్ ఇన్చార్జి మేజర్ డాక్టర్ చంద్రకాంత్ తెలంగాణ ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ ఉపాధ్యక్షులు పలేర్ల మైసయ్య ప్రధాన కార్యదర్శి పరస శ్రీనివాస్ కోశాధికారి మురళి కృష్ణ ఆర్పిఐ బుద్ధిస్ట్ వింగ్ తెలంగాణ అధ్యక్షులు చిత్తూరు అశోక్ ప్రధాన కార్యదర్శి గణేష్ కాంప్లె ఎస్ ఎస్ డి నాయకులు సంతోష్ కాంప్లె ముఖ్యఅతిథిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సొంత మనుమడు యశ్వంత్ భీమ్‌రావు వస్తున్నారు ఆర్పిఐ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ఎం పురుషోత్తం మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో ఉన్న ప్రజలందరూ కూడా ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

---

# మంచి మనసు చాటుకున్న కానిస్టేబుల్

**జన్నారం, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండల కేంద్రంలో గాయాల పాలైన మతిస్థిమితం లేని మహిళను ఆసుపత్రికి తరలించి కానిస్టేబుల్ శ్రీనివాస్ మంచి మనసును చాటుకున్నారు. బస్టాండ్ సమీపంలో మతిస్థిమితం లేక తిరిగే ఓ మహిళ చలి మంట వద్ద గాయపడింది. దీంతో కానిస్టేబుల్ శ్రీనివాస్ అక్కడికి చేరుకుని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో కానిస్టేబుల్ శ్రీనివాస్ గాయపడ్డ మహిళకు చికిత్స చేయించారు.

---



## ప్రతీ ఒక్క బీఆర్ఎస్ కార్యకర్త

# కేసీఆర్‌ల తయారవ్వాలి

### బోథ్ నియోజకవర్గ పరిధిలో గెలిచిన నూతన సర్పంచుల ఆత్మీయ సన్మానంలో కేటీఆర్

**ఆదిలాబాద్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
ప్రతి ఒక్క బీఆర్ఎస్ కార్యకర్త మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ల తయారవ్వాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి కేటీఆర్‌తో సమావేశమై మాట్లాడారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్ ఉప సర్పంచ్‌లను కేటీఆర్ శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుబంధు పాలన పోయి రాబందు పాలన వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో బోథ్ నియోజకవర్గ పరిధిలో గెలిచిన నూతన సర్పంచుల ఆత్మీయ సన్మాన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అయినా ఇప్పటికీ ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో అత్యధిక మంది రైతాంగం పండించే పత్తి పంట కొనుగోలు చేసే పరిస్థితి కూడా లేకుండాపోయిందన్నారు. ఈ ముఖ్యమంత్రి వచ్చాక పత్తి రైతు చిత్తయిపోయాడని.. సోయా రైతులను పట్టించుకునే వాళ్లు లేరని ఆరోపించారు. రాష్ట్ర రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తున్నారని అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో కేవలం కొన్ని వేల ఓట్లతో ఆదిలాబాద్, ఖానాపూర్, కాగజ్‌నగర్ వంటి నియోజకవర్గాలు కోల్పోయామని.. చిన్నచిన్న పొరపాట్లతో ఈ సీట్లని కోల్పోయాము కానీ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు తమ పార్టీకే అండగా నిలిచారని చెప్పారు. మరో రెండేళ్ల తర్వాత కచ్చితంగా బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. ఎమ్మెల్యే అనిల్ యాదవ్ డబ్బులు ధర్పం లేకున్నా మంచి మనసున్న నాయకుడని కొనియాడారు. అలాంటి నాయకుడిని కాపాడు కోవాల్సిన బాధ్యత పార్టీ పైన ఉన్నదని చెప్పారు. తెలంగాణతోపాటు ఆదిలాబాద్ జిల్లాకు తీవ్రంగా నష్టం చేస్తున్న బీజేపీకి కాంగ్రెస్ మద్దతు పలుకుతున్నదని ఆరోపించారు. రెండేళ్లలో రెండున్నర లక్షల కోట్ల అప్పు చేసిన రేవంత్‌రెడ్డి తెలంగాణకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ పంచాయతీరాజ్ ఎన్నికల స్ఫూర్తితో పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లోనూ మంచి విజయం సాధించాలన్నారు. గ్రామాలకు వచ్చే నిధులు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చే మెహర్బానీ కాదని.. అది రాజ్యాంగబద్ధంగా గ్రామాలకు గ్రామ సర్పంచులకు దక్కిన హక్కు అని తెలిపారు.

---

# బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల దుర్గం తిరుపతికి డాక్టరేట్




**బెల్లంపల్లి, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాటనీ సీనియర్ అధ్యాపకులు దుర్గం తిరుపతి పిహెచ్డి డాక్టరేట్ అందుకున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. మణిపూర్‌లోని "ఏషియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ"లో తిరుపతి పీహెచ్‌డీ చేశారు. ఆ యూనివర్సిటీలోని డాక్టర్ శోభిత్ కుమార్ శ్రీవాత్సవ్ గైడ్ షిప్ లో "మెడిసినల్ ప్లాంట్స్ ఫర్ యాంటీ వైరల్ పొటెన్షియల్ ఫైండింగ్ ఫ్రమ్ ఇండియన్ కాంటాక్స్" అనే అంశంపై పరిశోధన చేశారు. పరిశోధన పూర్తి కాగా సోమవారం యూనివర్సిటీలో ఓపెన్ వైవా నిర్వహించారు. తిరుపతి వ్యక్తం చేసిన పరిశోధనలు ఎగ్జా మినర్లను సంతృప్తి పరచడంతో ఆయనకు డాక్టరేట్ ప్రకటించారు.

**మారుమూల ఇట్యాల గ్రామం నుంచి...**
కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం చిట్యాల గ్రామానికి చెందిన దుర్గం తిరుపతి 2008లో తెలంగాణ విశ్వవిద్యాలయం నుంచి బాటనీ సబ్జెక్టులో పీజీ పట్టా పొందారు. అనంతరం అదే ఏడాది డిగ్రీ ఒప్పంద అధ్యాపకుడిగా చేరి వివిధ కళాశాలల్లో పనిచేసి ప్రస్తుతం బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన మణిపూర్‌లోని ఏషియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీలో పిహెచ్డి సీటు పొంది పరిశోధన పూర్తి చేశారు. ఆయన పిహెచ్డి వంటి ఉన్నత డిగ్రీని పొందడం పట్ల ఆయన కుటుంబ సభ్యులు, ఊరి ప్రజలు, బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్, వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, కళాశాల సూపరింటెండెంట్ భోదనేతర హర్షం వ్యక్తం చేశారు.

# భూ దందాపై కలెక్టర్ ఉక్కుపాదం



**కాగజ్‌నగర్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
కొమరం భీమ్ జిల్లా సిర్పూర్ (టి) మండలం లక్ష్మీపూర్ గ్రామ పరిధిలో సాగుతున్న భూ బాగోతం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరింది. సర్వే నంబర్ 47లోని 14.08 ఎకరాల ప్రైవేటు భూమిని కొందరు అక్రమార్కులు రికార్డులు తారుమారు చేసి తమ పేర్లపై మార్చుకున్నారనే ఆరోపణలపై జిల్లా కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. ఈ వ్యవహారంపై నిబంధనల ప్రకారం విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బాధితులు సాన మల్లయ్య, పేరా ఉష తమ గోడును వెళ్లబోసుకున్నారు. తరతరాలుగా తమ ఆధీనంలో ఉన్న భూమిని, రెవెన్యూ రికార్డుల్లో అక్రమంగా ఇతరుల పేర్లపైకి మార్చారని వారు అడిషనల్ కలెక్టర్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. అధికారుల అండదండలతోనే ఈ భూ బదలాయింపులు జరిగాయని వారు ఆరోపిస్తూ, తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. బాధితుల ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన కలెక్టర్, సంబంధిత తహసీల్దార్, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కీలక ఆదేశాలు చేసి సర్వే నంబర్ 47కు సంబంధించిన గత 30 ఏళ్ల రికార్డులను, గతంలో జరిగిన రిజిస్ట్రేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి. యాజమాన్య హక్కులు ఏ ప్రాతిపదికన మారాయో, అందులో నిబంధనల ఉల్లంఘన జరిగిందో లేదో తేల్చాలి. ఒకవేళ అక్రమాలు జరిగినట్లు తేలితే, సదరు రిజిస్ట్రేషన్లను రద్దు చేయడంతో పాటు అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. దీనిపై త్వరితగతిన పరిష్కారం చూపాలి భూ సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సూచించారు. లక్ష్మీపూర్ భూ అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.



## ప్రవేశ పరీక్షలు
# సద్వినియోగం చేసుకోవాలి

**నిర్మల్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ గురుకులాల్లో ఐదో తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు ప్రవేశల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రవేశ పరీక్ష పోస్టరు బ్యానర్లను ఆవిష్కరించారు. ఈనెల 21 వరకు ఆన్లైన్లో దరఖాస్తుల స్వీకరించి పరీక్ష ప్రతిభ ఆధారంగా విద్యార్థులను గురుకుల పాఠశాలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అవకాశాన్ని తల్లిదండ్రులు విద్యార్థులు సభ్యులు చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీనాయక్ బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్ ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి దయానంద్ అధికారులు పాల్గొన్నారు.

# వాంకిడిలో పారిశుధ్య పనులు

**వాంకిడి, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
వాంకిడి మండల కేంద్రంలోని 3వ వార్డులో సోమవారం సర్పంచ్ చునార్కర్ సతీష్ ఆధ్వర్యంలో సోమవారం పారిశుధ్య పనులు చేపట్టారు. పూడికతో నిండిన కాలువల్లో పూడిక తీత పనులను చేపట్టారు. అలాగే వాడలో ఉన్న చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించారు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్ పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు సభ్యుడు రాము, సఫాయి కార్మికులు ఉన్నారు.



# భీంపూర్‌లో సామాజిక తనిఖీపై విజిలెన్స్ అధికారి విచారణ

**భీంపూర్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
మండలంకు సంబంధించి గత సంవత్సరం నిర్వహించిన సామాజిక తనిఖీలో వచ్చిన అవకతవకల ఆరోపణలపై జిల్లా విజిలెన్స్ అధికారి రాజేశ్వర్ సోమవారం భీంపూర్ మండల కేంద్రంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామాల వారీగా రికార్డులను పరిశీలించారు. విచారణలో ఎంపీడీఓ సుమీర్ అహ్మద్ ఖాన్, ఏపీఓ సంగీత, ఈసీ ఆడే నరేందర్‌తో పాటు పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. విజిలెన్స్ అధికారి రాజేశ్వర్ మాట్లాడుతూ, గత ఆడిటింగ్‌లో ప్రొసీజర్ వైలేషన్, ఫైనాన్షియల్ మిస్ ప్రాపరేషన్, ఫైనాన్షియల్ డివియేషన్ వంటి అంశాలపై రకరకాల అభియోగాలు వచ్చినట్లు తెలిపారు. వాటికి సంబంధించి ఆధారాలు సేకరించి, తగిన చర్యల కోసం విచారణ జరుపుతున్నామని చెప్పారు.



# ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు
## ప్రజావాణి సమస్యలపై అధికారులను ఆదేశించిన అదనపు కలెక్టర్ దీపక్ తివారి



**ఆసిఫాబాద్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్‌లు అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సిర్పూర్(టి) మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలోని సర్వే నంబరు 47లో గల 14.08 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు అక్రమ పట్టా చేశారని దానిని రద్దు చేయాలని గ్రామానికి చెందిన మల్లయ్య, ఊశాలు వినతి పత్రం సమర్పించారు. జిల్లా కేంద్రంలోని దశ్నాపూర్‌కు చెందిన పొన్న సునీత తనకు వితంతు పింఛన్ ఇప్పించాలని, రెబ్బెన మండలం గోలేటి గ్రామానికి చెందిన జాదవ్ రోహిదాస్ తమ గ్రామంలో ప్రతిపాదిత ఓపెన్‌కాస్టు నిర్వాసితుల జాబితాలో తన పేరు లేనందున విచారణ జరిపించి న్యాయం చేయాలని దరఖాస్తులు అందజేశారు. రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన దుర్గం లక్ష్మి తాను సాగు చేస్తున్న ప్రభుత్వ భూమిని పట్టా చేసి తనకు పాసుపుస్తకం మంజూరు చేయాలని, జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌కు చెందిన పడాల తిరుపతి తన ఇళ్లు భారీ వర్షాలకు కూలీ పోయినందున నష్టపరిహారం మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కౌటాల మండలం సాండ్‌గాం గ్రామానికి చెందిన రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని దరఖాస్తు చేశారు. కెరమెరి మండలం ఝరి గ్రామానికి చెందిన షేక్ దస్తగిరి తాను కొనుగోలు చేసిన భూమిని సాదాబైనామ ప్రకారం పట్టా మార్పిడి చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేసి చర్యలు తీసుకోవాలని కోరారు.



# గాంధీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం

**నిర్మల్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని గాంధీనగర్ గ్రామంలో సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో విలేజ్ మెగా హెల్త్ క్యాంప్ పెట్టడం జరిగింది. జనరల్ చెకప్‌తో పాటు రక్త పరీక్షలు చేయడం జరిగింది. జీబీ, హెచ్ ఐవీపై యువకులకు ప్రజలకు అవగాహన కల్పించి, హెచ్ఐవి శాంపిల్స్ టెస్ట్ చేయడం జరిగింది. మొత్తం 150 పరీక్షలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆమని మెడికల్ ఆఫీసర్ విజయకుమార్, సెక్రెటరీ సంగీత, భోజన్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పట్టుదలతో శ్రమిస్తే విజయం ఖాయం

**ముథోల్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
ముథోల్ మండలంలోని మచ్కల్, చించాల, ఏడ్‌బిడ్, బోరిగాం గ్రామంలోని ప్రభుత్వజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మోహన్ రావ్ పటేల్ ప్రజా ట్రస్ట్ తరుపున ట్రస్ట్ చైర్మెన్ మోహన్‌రావ్ పటేల్ నేతృత్వంలో మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్ పటేల్ ఆధ్వర్యంలో సోమవారం పదవ తరగతికి సంబంచి ఆల్ ఇన్ వన్ గైడ్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజి ఎంపీపీ సుభాష్ జాదవ్ పటేల్ మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థుల చదువుకు అండగా నిలవాలనే ఉద్దేశంతో మోహన్ రావ్ పటేల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల కు సిద్ధం అయ్యేందుకు ఈ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేస్తున్నమని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు ఒత్తిడిని జయిస్తూ విజయం సాధించాలని, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలని సూచించారు. చదివే మెళకువలు, అనుసరించాల్సిన విధానం గురించి తెలియజేశారు. కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలని, ప్రతి ఒక్కరికి ఆల్ ది బెస్ట్ చెప్పారు.విద్యార్థులు పాఠశాల అధ్యాపకులు ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావ్ పటేల్ కు, మాజీఎంపిపి సుబాస్ జాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు, సర్పంచ్, ఉప సర్పంచ్‌లు పత్తి రెడ్డి రాం చందర్ రెడ్డి, గంగాధర్, ఆత్మ స్వరూప్, కిష్టయ్య, సర్వేష్, అనూరాధ గణపతి, సాయినాథ్ గౌడ్, గోపాల్, భూమన్న, ట్రస్ట్ టీం సభ్యులు ముథోల్ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# హామీ ఇచ్చారు.. మాట నిలబెట్టుకున్నారు



**జైనూర్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
ప్రకృతీ సహజసిద్ధంగా కొండ కోనల్లో కొలువుదీరిన ఆరాధ్య దేవతల సన్నిధిలో భక్తులు సేద తీరడానికి షెడ్ల నిర్మాణం చేపడతామని ఇచ్చిన హామీని ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట నిలబెట్టారు. సోమవారం మండలంలోని భూసిమెట్ట గ్రామ సమీపంలోని సుగాపూర్ అవ్వల్ పెన్ (పోచమ్మ తల్లి) , రావుజీ గూడ లో జై జంగో జై లింగు దేవస్థానం వద్ద మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆదేశాల మేరకు జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, స్థానిక సర్పంచులు దుర్వ సింధు నగేష్, ఉయిక చందు, జాదవ్ భావు రావు తో కలిసి షెడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావు మాట్లాడుతూ ఆదివాసీల పురాతన ఆలయాలు, ఇలవేల్పు పుణ్యక్షేత్రాల వద్ద భక్తుల సౌకర్యార్థం కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగా షెడ్లు నిర్మించడం జరుగుతుందని చెప్పారు. హామీ ఇచ్చిన అనతి కాలంలోనే షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం తో ఆయా గ్రామాల నుంచి మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యుడు మండాడి లింగు, నాయకులు మెస్రం అంబాజీ రావు, కనక గంగారం, పెందుర్ ప్రకాష్,గ్రామ పటేల్ ఆత్రం భాపురావు, కుమర కట్టి, జై జంగో లింగు భక్తులు ఊర్వేత మోహన్, రోహిదాస్, తనాజీ, నగేష్, మెస్రం దత్తు తదితరులు పాల్గొన్నారు.



## పనులను నాణ్యతతో చేపట్టేలా చూడాలి

### ఆర్అండ్‌బీ డిఈ సునీల్

**కుభీర్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రమైన కుభీర్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద నూతనంగా నిర్మిస్తున్న తహసీల్దార్ భవనాన్ని సోమవారం ఆర్అండ్‌బీ డిఈ సునీల్ పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. పనులను నాణ్యతతో చేపట్టి పది కలల పాటు ఉండేలా చూడలని సంబంధిత కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ పనులను త్వరగా పూర్తి చేసి తహసీల్దార్ భవనాన్ని అందుబాటులో తీసుకురావాలన్నారు. అదేవిధంగా మండలంలో పలు రహదారుల టెండర్లు పూర్తయ్యాయని త్వరలోనే పనులను ప్రారంభిస్తామన్నారు. పనులను ఎప్పటికప్పుడు పరిశీలించి నాణ్యతతో ఉండేలా చూస్తామని అన్నారు.

## ఆత్మస్థైర్యంతో విజయం సాధించవచ్చు



**నిర్మల్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
ఆత్మవిశ్వాసం పట్టుదల ఆత్మస్థైర్యం ఉంటే ఎంతటి పలితామైనా సాధించవచ్చు వక్తలు సూచించారు. పట్టణంలోని విజయ హైస్కూల్‌లో లీడ్ ఇండియా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి మంచి మార్కులు సాధించడం భవిష్యత్తును ఉజ్వలంగా మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భూమయ్య, నాగభూషణ్ మోహన్ రెడ్డి హౌ తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు నట్టల నివారణ మందుల పంపిణీ

**వాంకిడి, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
వాంకిడి మండల కేంద్రంలోని సవాతి గ్రామపంచాయతీలో పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల పశువైద్య అధికారి డాక్టర్ శరణ్య ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సవాతి గ్రామ సర్పంచ్ సోయం చంపబాయ్, ఉప సర్పంచ్ సోనూర్లే నానాజీ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశువుల ఆరోగ్య పరిరక్షణకు నట్టల నివారణ ఎంతగానో ఉపయోగపడుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్య సిబ్బంది గణపతి, రాజు, నరేష్, వినోద్, పాల్గొని పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు.

## కారు ఢీకొని యువకుడికి గాయాలు

**నిర్మల్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
డిగ్రీ కళాశాల సమీపంలో సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. మామడ మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన రఘు నిర్మల్ వెళ్తుండగా, వెనుక నుంచి కారు బలంగా ఢీకొట్టడంతో కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించగా, ప్రైవేట్ ఆసుపత్రి వారు నిజామాబాద్ తీసుకెళ్లాలని చెప్పడంతో కుటుంబ సభ్యులు నిజామాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు.

# కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన తహసీల్దార్

**సాత్నాల, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
వారిది ఓ నిరుపేద గిరిజన కుటుంబం. వారసత్వంగా వచ్చిన భూమి ఏ సర్వే నంబర్‌లో ఉందో తెలియకపోగా, పట్టా జారీ అయిన విషయం కూడా తెలియక ఇబ్బందులు పడుతున్న తరుణం అది. పట్టా కల్పించాలని బాదితులు జిల్లా కలెక్టర్ రాజర్షి షా దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కలెక్టర్ స్థానిక తహసీల్దార్ జాదవ్ రామారావుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో విచారణ జరపడంతో పాటు కొన్నేళ్ల కిందటి రికార్డులను తిరగేశారు. ఎట్టకేలకు సర్వే నంబర్ 72/19లో5 ఎకరాల భూమిని గుర్తించిన అధికారులు.. బాధితుల పేరిట పట్టా జారీ చేశారు. దీంతో ఆ గిరిజన కుటుంబం హర్షం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ జిల్లా సాత్నాల మండలం దుబ్బగూడ గ్రామ పంచాయతీ టెంబ్రిగూడ గ్రామానికి చెందిన టేకం రాము సర్వే నంబర్ 72/9 సాంగ్వి శివారులో తన తాతగారైన టేకం దేశ్ముఖ్ సోము పేరిట గల 5 ఎకరాల భూమిని వారసత్వంగా తన పేరిట 2018-19లో పట్టా చేయించేందుకు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు పట్టా జారీ కాగా డిజిటల్ సంతకం లేని కారణంగా పాసు పుస్తకం జారీ చేయలేదు. ఈ నేపథ్యంలో 2024లో అదే విషయమై రాము యత్నించగా.. పట్టా జారీ అయింది. ఆలోపే రాము మరణించారు. దీంతో ఈ విషయం వారి కుటుంబానికి తెలియక తర్జన భర్జన పడ్డారు. ఏ సర్వే నంబర్‌లో తమ భూమి ఉందో తెలియక..పట్టా కల్పించాలని జిల్లా కలెక్టర్ ను ప్రజావాణిలో ఆశ్రయించారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత తహశీల్దార్ కు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ జాదవ్ రామారావు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, కొన్నేళ్ల కిందటి రికార్డులను పరిశీలించారు.స్థానిక



గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతిమంగా సర్వే నంబర్ 72/19 లో టేకం రాము పేరిట 5ఎకరాల భూమిని అధికారులు గుర్తించారు. కాగా ఈ భూమిని వారి కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు.. రాము భార్య టేకం మోతిబాయి, తమ్ముడు టేకం లేతు ల పేరిట చెరో 2.5 ఎకరాల భూమికి పట్టా కల్పించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో.. తహసీల్దార్ జాదవ్ రామారావు బాధిత కుటుంబానికి పట్టాను అందజేశారు. దీంతో వారు తహశీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దుబ్బగూడ ఉప సర్పంచ్ కొడప అయ్యూ, పాల్గొన్నారు.

# మహిళల సాధికారతే లక్ష్యం



**మందమర్రి, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
మహిళల సాధికారత, అభివృద్దే లక్ష్యమని సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు శ్రీవాణిరాధాకృష్ణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సీఈఆర్‌క్లబ్‌లో టైలరింగ్, మగ్గంవర్కు, బ్యూటిషియన్ ఉచిత శిక్షణ తరగతుల ప్రారంభానికి అతిథిగా హాజరై మాట్లాడారు. సేవా సమితి ఆధ్వర్యంలో వేలాది మంది మహిళలకు ఉచిత ఉపాధి శిక్షణ కోర్సులను ప్రవేశపెట్టి శిక్షణ ఇవ్వగా వారు ఉపాధి పొందుతున్నారన్నారు. ఇప్పటి వరకు చాలా మంది మహిళలు శిక్షణ పొంది సొంతంగా షాపులను ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారన్నారు. మహిళల సంక్షేమానికి యాజమాన్యం పెద్దపీట వేస్తుందన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో సేవా సమితి ముందుంటుందన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆరోగ్య జాతర

**బజార్‌హత్నూర్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఆరోగ్య జాతర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ప్రతిరోజు నేర్చుకుని ఆరోగ్య కళాశాల కార్యక్రమాలను వారి యొక్క అనుభవాలను ఈ కార్యక్రమం ద్వారా తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, పోషణ ,మానసిక ఆరోగ్యం, ఉద్వేగ పరిపక్వత యాంటీ డ్రగ్స్, కాలానుగుణ వ్యాధులు, వ్యక్తిత్వ వికాసము తదితర



అంశాలను సంవత్సరమంతా తెలుసుకొని దానిని అధ్యాయించుకున్నట్లు విద్యార్థులు తెలియజేశారు. ఇటువంటి కార్యక్రమాన్ని కళాశాలలో నిర్వహించినం దున జిల్లా కలెక్టర్‌కు అధ్యాపకులందరికీ విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సునీల్ కుమార్, ఆరోగ్య కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ షిండే జ్ఞానేశ్వర్, అధ్యాపకులు ప్రదీప్ కుమార్, భీమేష్, అశోక్ రెడ్డి, నవీన్ రెడ్డి, వనజ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## భూతాయి (కే)లో క్రికెట్ టోర్నమెంట్

**బజార్‌హత్నూర్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
మండలంలోని భూతాయి (కే) గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు యువ జన సంఘ సభ్యులు పేర్కొన్నారు. ఈ పోటీలను స్థానిక సర్పంచ్ మాడావి సింధు చేతిలో మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆటలు యువతలో మంచి క్రమశిక్షణను ఐకమత్యాన్ని పెంపొందించడంతోపాటు శారీరకంగా దృఢత్వాన్ని కలిగి మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని అన్నారు. యువత క్రీడాస్పూర్తిని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాడవి జైతు, తుడసం వినాయక రావు, బీమ్ రావ్, మారుతి, సంతోష్, విశ్వనాథ్, శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.



## బాధితులకు భరోసాగా గ్రీవెన్స్ డే

**నిర్మల్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
బాధితులకు భరోసా కల్పించేందుకు ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, సమస్యలను పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆమె ఆదేశించారు. ప్రజలకు పోలీసు సేవలను చేరువచేయడం, ప్రజా సమస్యలను పరిష్కరించడం లక్ష్యంగా కృషి జరుగుతుందన్నారు.

## కాపాస్ కిషన్ యాప్‌తో ఇక్కట్లు



**ఆసిఫాబాద్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
ఆసిఫాబాద్ జిల్లాలో పత్తి రైతులు కాపాస్ కిషన్ యాప్ ద్వారా పత్తి అమ్మకాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీసీఐ కొనుగోలు కోసం ఆన్‌లైన్ చేయడంలో సిగ్నల్ సమస్యలు, అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఆన్‌లైన్ చేసి పది రోజులు గడిచినా కొనుగోలు జరగక పోవడంతో పత్తి నిల్వలు పాడై నష్టపోతున్నారని డివైఎఫ్ఐ నాయకులు ఆరోపించారు.

## ఏజెన్సీని వణికిస్తున్న చలి

**వాంకిడి, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
వాంకిడి మండలంలోని ఏజెన్సీ వాసులను చలి గడగడ వణికిస్తున్నది. వారం రోజుల నుంచి చలి రోజురోజుకు తీవ్ర మవుతున్నది. సాయంత్రం 5.00గంటలకే చలి మొదలవుతోంది. 8 గంటల వరకూ పొగ మంచు వీడడం లేదు. చలి దూరం చేసేందుకు మంటలు కాగుతూ ఉపశమనం పొందుతున్నారు. అలాగే ఉదయం పూట మంచు దుప్పటి కప్పేస్తుంది. అన్ని ప్రధాన రహదారుల్లో ముందు మనిషి, ముందున్న రోడ్డు, ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించ నంతగా మంచు కమ్మేస్తుంది. దీంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు.

## మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ
# సేవలు అభినందనీయం

బోథ్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)
తన తల్లి మాసం లక్ష్మీ జ్ఞాపకార్థకం మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ స్థాపించి అమ్మ పేరు మీద సేవలు చేయడం చాలా గొప్ప విషయం అని బోథ్ సర్పంచ్ అన్నపూర్ణ,ఎంపిడిఓ రమేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రం లోని గ్రామ పంచాయితీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో రమేష్, సర్పంచ్ అన్నపూర్ణ హాజరు అయ్యారు ఈ సందర్భంగా ఎంపిడిఓ రమేష్ మాట్లాడుతూ మాసం అనిల్ యొక్క ప్రతి సేవ కార్యక్రమం లో నేను అతిథిగా వెళ్ళాను గత సంవత్సరం కూడా దుప్పట్లు పంపిణీ చేయడం జరిగింది ఇలాగే మరిన్ని సేవలు చేయాలి అని తెలిపారు అలాగే ప్రతి కార్యక్రమం లో భాగస్వామ్యం అవుతా అని తెలిపారు. బోథ్ సర్పంచ్ అన్నపూర్ణ మహేందర్ మాట్లాడుతూ మాసం అనిల్ నాకు చాలా పరిచయస్తుడు అని అనిల్ యొక్క ప్రతి ఒక్క సేవా కార్యక్రమం చూస్తా అని చిన్న వయసులో తల్లి పేరు ఇలా పెద్ద పెద్ద సేవ కార్యక్రమాలు చేయడం గొప్ప అని తెలిపారు. ఇలాగే మరిన్ని సేవ కార్యక్రమాలు చేయాలి అని సర్పంచ్ అయ్యాక నా మొదటి కార్యక్రమం ఇదే అని తెలిపారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పుంద్రు విజయ లక్ష్మీ, పంచాయితీ కార్యదర్శి అంజయ్య,మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ మాసం అనిల్ కుమార్ వార్డు సభ్యులు మేడిచెల్మ రూప ప్రవీణ్, కరిపే శ్రీనివాస్,బిట్లింగ్ గిరీష్ మరియు మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ కుట్టు మిషన్ నిర్వాహకురాలు శ్రీజ మరియు సన్నీ రెడ్డి గ్రామపంచాయితీ సిబ్బంది మరియు కుట్టు మిషన్ శిక్షణ అభ్యర్థులు పాల్గొన్నారు







## ఏపీకే ఫైల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

లోకేశ్వరం, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)
న్యూ ఇయర్ పేరిట మొబైల్ ఫోన్స్కు వచ్చే ఏపీకే ఫైల్స్ అత్యంత ప్రమాదకరమని, వీటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లోకేశ్వరం ఎస్ఐ అశోక్ తెలిపారు. వాట్సాప్ గ్రూపులు,ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా(అర్టీఏ) చలాన్,(టీజీపోలీస్) చలాన్ వంటి సందేశాల్లో ఏపీకే ఫైల్స్ పంపించి సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతారన్నారు.ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ అలాంటి లింకులు డౌన్లోడ్ చేయకూడదన్నారు.

### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో
## డయాబెటిస్ కార్యక్రమం

జన్నారం, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)
జన్నారం మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డయాబెటిస్ కార్యక్రమం నిర్వహించారు. 150 మందికి పైగా డయాబెటిస్ బాధితులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ తోట లచ్చన్న, సెక్రెటరీ ఎర్ర ప్రవీణ్ కుమార్ జోన్ చైర్ పర్సన్ సతీష్ కుమార్ క్యాబినెట్ మెంబర్ అనుముల రాజన్న లయన్స్ క్లబ్ సభ్యులు కొమురెల్లి లచ్చన్న సైన్ల మల్లేష్ మురుమడుగు సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు సరిపడా యూరియా అందజేస్తాం

ఆసిఫాబాద్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)
యాసంగి సీజన్‌లో రైతులకు సరిపడా యూరియా అందజేస్తామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణ, ఇతర ఉన్నతాధికారులతో కలిసి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్‌లతో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రబి సీజన్‌కు సరిపడా యూరియా అందుబాటులో ఉందన్నారు. అవసరమైన రైతులకు అందించాలని తెలిపారు. యూరియా పక్కదారి పట్టకుండ అన్ని చర్యలు తీసుకొవాలని పంపిణీ కేంద్రాల వద్ద రద్దీ లేకుండా పర్యవేక్షించడంతో పాటు రైతులకు ఇబ్బందులు లేకుండా టెంటులు, తాగునీరు ఏర్పాటు చేయాలని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో రైతుల సౌకర్యం కోసం టోల్‌ఫ్రీ నంబరు 18005995770 ఏర్పాటు చేశామని




తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ జిల్లాలో యాసంగి సీజన్‌లో సాగు చేసే పంటలకు సరిపడా 90వేల వరకు యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 10,800బస్తాల యూరియా ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ తివారి, డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, డీఏవో వెంకట్, మార్కెటింగ్ అధికారి అశ్వక్ ఆహ్మద్, ఉద్యానవన అధికారి నదీం, ఏడీఏ మిలింద్ పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలి

### ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి





ఆసిఫాబాద్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)
ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జీరో అవర్‌లో మాట్లాడుతూ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం నుంచి ఉట్నూర్ వరకు ఉన్న రహదారికి మరమ్మతులు చేయాలని, ఇది పూర్తిగా గుంతలమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంలోని గాదిగూడ, నార్నూర్, లింగాపూర్‌తో పాటు ఇతర మండలాల్లో అనేక రహదారులు పూర్తిగా అధ్వానంగా ఉన్నాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేయాల్సిన అవసరముందన్నారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న గుండి, లక్మాపూర్, అనార్పల్లి బ్రిడ్జిలను పూర్తి చేయాలని కోరారు. కుమ్రం భీం ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను వేరుగా చూడకుండా ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి కోసం నిధుల విడుదల చేయాలని, అప్పుడే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రజా సంక్షేమం కోసం అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు.

## నిబంధనలు పాటించాలి

ఆసిఫాబాద్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)
జిల్లాలోని అన్ని పీఎం శ్రీ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించే కార్యక్రమాల్లో నిబంధనలు పాటించాలని అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఈవో దీపక్ తివారి అన్నారు. కలెక్టరేట్‌లో ఎంఈవోలు, హెచ్‌ఎంలతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సకాలంలో బిల్లులు ఖజనా కార్యాలయంలో సమర్పించాలన్నారు. పదో తరగతిలో ఫలితాల సాధన కోసం 100 శాతం ఉత్తీర్ణత సాదించేలా కృషి చేయాలని చెప్పారు.. ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, ఫైనాన్స్ అడిట్ అధికారి దేవాజీ, ఎంఈఓలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

## గిన్నీస్ రికార్డులో లతీక



తాండూర్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)
తాండూర్ మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన బద్దిపల్లి శృతి, రమేష్ దంపతుల కుమార్తె లతీక గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్ అందుకుంది. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో భారత్ ఆర్ట్స్ అకాడమీ సంస్థ ఈనెల 27న హైదరాబాద్ కళా రత్న ఇంద్రగంటి వెంకటేశ్వర శర్మ పర్యవేక్షణలో 5700 మంది కూచిపూడి కళాకారులతో నిర్వహించిన నాట్య ప్రదర్శనలో లతిక పాల్గొని ప్రదర్శన ఇచ్చింది. ప్రదర్శనకు సర్టిఫికెట్ అందజేశారు.

### చదువుకోమన్నందుకు
## మనస్థాపంతో విద్యార్థి ఆత్మహత్య

దండేపల్లి, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)



దండేపల్లి మండలానికి చెందిన ఆకర్ష్ అనే విద్యార్థి, సోమవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్నేహితులతో ఆడుకోవడానికి వెళ్తుంటే తల్లి చదువుకోవాలని చెప్పడంతో మనస్తాపానికి గురై ఈ ఘాతు కానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులు చదువుపై శ్రద్ధ పెట్టమని చెప్పినప్పుడు పిల్లలు ఇలాంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

## అధికారుల పర్యవేక్షణ లోపం కాంట్రాక్టర్ల ఇష్ట రాజ్యం




జన్నారం, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)
జన్నారం టు కవ్వాల్ ఆటో పాయింట్ నుండి నిర్మించిన బీటీ రోడ్డు పూర్తి నాసిరకంగా ఉందని సిపిఐ పార్టీ సందర్శనలో తేలిందని రోడ్డు వేసి వారం కూడా గడవకుండా బిచ్చులు బిచ్చులుగా లేచిపోవడం చూస్తుంటే హాస్యాస్పదంగా ఉందని తెలియజేశారు. అదే రకంగా ఎమ్మెల్యే కృషిచేసి మంజూరు చేయించిన రోడ్డు పనులను అధికారుల నిర్లక్ష్య ధోరణి వలన నిధులు దుర్వినియోగం అవుతున్నాయి ఇది ప్రజల సొమ్మని ప్రజలు క్షమించరని సిపిఐ పార్టీ భావిస్తుంది. గత కొంతకాలంగా రోడ్డు అధ్వాన పరిస్థితులతో ఉండగా రోడ్డుకు సంబంధించిన తదితర గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ రోడ్డు సాంక్షన్ చేయించడం జరిగింది స్థానిక అధికారులు పర్యవేక్షణ లోపం వల్ల రోడ్డు వేసిన వారంలోనే పెచ్చులు ఊడుతున్నాయి ఇట్టి రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ పై మరియు పర్యవేక్షణ చేయని అధికారులపై ప్రభుత్వపరంగా ఆర్అండ్‌బి విజిలెన్స్ ద్వారా చర్యలు తీసుకోవాలని రోడ్డును పునర్ నిర్మించాలని భారత కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేస్తుంది సమావేశంలో కలిందర్ అలీ ఖాన్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, దాసరి తిరుపతి మండల కార్యదర్శి, మిట్టపల్లి పౌలు, చాడ మహేందర్ రెడ్డి జిల్లా సమితి సభ్యులు మామిడి విజయ్ మండల కన్వీనర్ బియ్యాల రాజేశం తదితరులు పాల్గొన్నారు.

# రిలీజ్ ముంగిట మరో ట్రైలర్..




ప్రభాస్ 'రాజాసాబ్' నుంచి మరో ట్రైలర్ వచ్చేసింది. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. ఈ కార్యక్రమంలోనే ట్రైలర్ రిలీజ్ చేస్తారేమోనని అభిమానులు ఆశపడ్డారు కానీ ఆదికాస్త ఆలస్యమైంది. ఇప్పుడు దాన్ని విడుదల చేశారు. గతంలో తీసుకొచ్చిన ట్రైలర్‌కి ఏ మాత్రం తగ్గకుండా ఇది ఉంది. ఇందులో కామెడీ, హారర్ లాంటి ఎమోషన్స్ బాగానే చూపించారు. ఈ సినిమా.. జనవరి 9న థియేటర్లలోకి రానుంది. 8వ తేదీన రాత్రి ప్రీమియర్లు కూడా వేస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే ప్రీమియర్లు, టికెట్ రేట్ల గురించి క్లారిటీ రావొచ్చు. లేదంటే మాత్రం 8వ తేదీ సెకండ్ షోల నుంచి సినిమా రిలీజ్ అవుతుంది. ఇందులో ప్రభాస్ సరసన మాళవిక, నిధి అగర్వాల్, రిద్ది కుమార్ హీరోయిన్లుగా చేశారు. సంజయ్ దత్ కీలక పాత్ర పోషించారు. మారుతి దర్శకుడు. తమన్ సంగీతమందించాడు.

# ప్రళే ప్రపంచంలోకి అలియా?



'ధురంధర్'తో భారీ వసూళ్లను సొంతం చేసుకొని ఈ ఏడాది బాలీవుడ్ బాక్సాఫీసుకు కొత్త కళ తీసుకొచ్చారు కథానాయకుడు రణ్‌వీర్ సింగ్. శక్తిమంతమైన పాత్రలతో ప్రయాణిస్తున్న ఆయన 'ప్రళే' అనే చిత్రంలో నటిస్తున్నట్లు వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. జై మెహతా దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఇందులో కథానాయికగా అలియా భట్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. "పోస్ట్-అపోకలిప్టిక్ జాంబీ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో అలియాను ప్రేమికురాలిగా పరిచయం చేయట్లేదు. ఆమె పాత్ర హీరో ఆలోచనలను సవాలు చేసేలా ఉంటుంది. ప్రస్తుతం అలియాతో చర్చలు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది ఆగస్టులో దీన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నారు. ఇందులో మనుగడ కోసం పోరాటం చేసే వ్యక్తిగా కనిపించనున్నారు రణ్‌వీర్" అని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే 'గల్లీ భాయ్', 'రాకీ ఔర్ రాణీ కి ప్రేమ్ కహానీ' చిత్రాలతో రణ్‌వీర్, అలియా జంటగా తెరపై సందడి చేశారు.

# 'టాక్సిక్'లో ఎలిజబెత్



యశ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ - అప్స్' సినిమా ప్రచార కార్యక్రమాలు ఊపందుకుంటున్నాయి. సినిమాలోని పాత్రలు ఒకొక్కటిగా పరిచయం అవుతున్నాయి. గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో హ్యూమా ఖురేషీ ఓ కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఆమె ఎలిజబెత్ అనే పాత్రలో నటిస్తున్నట్టుగా ప్రకటిస్తూ... ఆదివారం ఆ పాత్ర లుక్‌ని విడుదల చేశాయి సినీ వర్గాలు. ఆ పాత్ర గురించి దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ సామాజిక మాధ్యమాల్లో పలు విషయాల్ని వెల్లడించారు. "ఎలిజబెత్ పాత్రలో హ్యూమా వేసే ప్రశ్నలు లోతైన ఆలోచనల్ని రేకెత్తించేలా ఉంటాయి. ఒక విభిన్నమైన, బలమైన వ్యక్తిత్వాన్ని తెరపై ఆవిష్కరిస్తుంది. ఇలాంటి పాత్రకు తగ్గ నటిని ఎంపిక చేయడం నాకు ఎంతో కష్టంగా అనిపించింది. ఎప్పుడైతే హ్యూమా నా ఫ్రేమ్‌లోకి అడుగు పెట్టిందో ఆ క్షణంలోనే ఆమె ప్రత్యేకతని గమనించా" అన్నారు. ఈ సినిమా కోసం ఎవరూ ఊహించని సాహసాన్ని మనం చేస్తున్నామని, కెప్టెన్‌గా నువ్వు చేస్తున్న ఈ పని ఓ మాయాజాలం అనీ, ఇది నెరవేరేలా చేసిన తిరుగులేని శక్తి యశ్‌కు కృతజ్ఞతలు అంటూ దర్శకురాల్ని ఉద్దేశిస్తూ సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్య చేశారు కథానాయిక హ్యూమా ఖురేషీ. వెంకట్ కె.నారాయణ, యశ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 19న రానుంది.

# లెనిన్ కోసం భాగ్య శ్రీ వెయిటింగ్..!



అందం, అభినయం ఉన్నా కూడా హిట్ అందుకోవడంలో కాస్త వెనుకబడి ఉంది అందాల భామ భాగ్య శ్రీ బోర్స్. పర్ఫెక్ట్ స్టార్ హీరోయిన్ మెటీరియల్ అయిన ఈ అమ్మడు తొలి సినిమా మిస్టర్ బచ్చన్ తోనే యూత్ ఆడియన్స్ కి హాట్ ఫేవరేట్ అయ్యింది. మిస్టర్ బచ్చన్ సరిగా మెప్పించలేకపోయినా విజయ్ దేవరకొండ కింగ్ డం తో సత్తా చాటుతుందని అనుకోగా ఆ సినిమాలో ఆమెది హీరోయిన్ కి తక్కువ సైడ్ రోల్ కి ఎక్కువ అన్నట్టుగా చేశారు. కనీసం ఆ సినిమాలో హీరో హీరోయిన్ మధ్య ఉన్న సాంగ్ కూడా తీసేసి భాగ్య శ్రీ ఫ్యాన్స్ ని హర్ట్ అయ్యేలా చేశారు. ఆ సినిమా రిజల్ట్ ని ఊహించని భాగ్య శ్రీ కాస్త అప్సెట్ అయ్యింది. ఐతే నవంబర్ లో రెండు వారాల గ్యాప్ లో రెండు సినిమాలతో అలరించింది భాగ్య శ్రీ. అందులో ఒకటి కాంత కాగా మరొకటి రామ్ తో చేసిన ఆంధ్రా కింగ్ తాలూకా. రామ్ సినిమా కాస్త సందడి చేసినా కాంత ఎలా వచ్చిందో అలానే వెళ్లింది. ఆంధ్రా కింగ్ తాలూకా మంచి సినిమానే కానీ అది ఎందుకో ఆడియన్స్ సరిగా రిసీవ్ చేసుకోలేదు. ఆంధ్రా కింగ్ లో భాగ్య శ్రీ లుక్స్ ఆకట్టుకున్నాయి. ఐతే అమ్మడు నెక్స్ట్ అక్కినేని అఖిల్ తో లెనిన్ సినిమా చేస్తుంది. చేస్తున్న సినిమాలన్నీ రిలీజ్ ముందు బజ్ రావడం ఆఫ్టర్ రిలీజ్ నీరసపడేలా చేయడం భాగ్య శ్రీ కెరీర్ లో ఇప్పటి వరకు అది రిపీట్ అవుతూ వచ్చింది. ఐతే లెనిన్ విషయంలో అది జరగకూడదని అనుకుంటుంది భాగ్యం. కాంత, ఆంధ్రా కింగ్ తాలూకా సినిమాల ఫలితాలు ఎలా ఉన్నా ఆమె గ్లామర్ తో పాటు యాక్టింగ్ టాలెంట్ ని ఆడియన్స్ గుర్తించారు. సో లెనిన్ తో కమర్షియల్ హిట్ పడితే అమ్మడు తిరిగి ఫాంలోకి వచ్చినట్టే అవుతుంది. అందుకే లెనిన్ సినిమా కోసం భాగ్య శ్రీ ఆసక్తిగా ఎదురుచూస్తుంది. అసలైతే అఖిల్ లెనిన్ కూడా నవంబర్ రిలీజ్ ప్లాన్ చేశారు కానీ పోస్ట్ ప్రొడక్షన్ ఇంకా కాస్త షూటింగ్ అవ్వకపోవడంతో నెక్స్ట్ ఇయర్ ఫిబ్రవరి లేదా సమ్మర్ రిలీజ్ అనుకుంటున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ కలిసి లెనిన్ సినిమా నిర్మిస్తున్నారు. మురళి కిషోర్ అబ్బూరు డైరెక్ట్ చేస్తున్న లెనిన్ సినిమా నుంచి అప్పట్లో వచ్చిన టీజర్ ఇంప్రెస్ చేసింది. ఈ సినిమాలో ముందు హీరోయిన్ గా శ్రీలీలను అనుకోగా ఆమెతోనే టీజర్ వదిలారు. కానీ కొంత షెడ్యూల్ అయ్యాక శ్రీలీల డేట్స్ అడ్జెస్ట్ అవ్వట్లేదని ఆమె ప్లేస్ లో భాగ్య శ్రీని తీసుకున్నారు. మరి భాగ్య శ్రీ ఎదురుచూస్తున్న హిట్ సినిమా లెనిన్ అవుతుందా లేదా అన్నది ఆ సినిమా రిలీజ్ అయ్యాక తెలుస్తుంది.

# చరణ్'పెద్ది' సెట్స్ లో లెజెండరీ యాక్టర్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'పెద్ది'. ఈ సినిమాపై పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు ఉన్నాయి. ఇక ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. తాజాగా ఈ సినిమా సెట్స్ నుండి లెజెండరీ యాక్టర్ బోమన్ ఇరానీతో కలిసి దర్శకుడు బుచ్చిబాబు, కెమెరామెన్ రత్నవేలు కలిసి దిగిన ఫోటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ పిక్ వైరల్ గా మారింది. మొత్తానికి బోమన్ ఇరానీ పాత్ర ఈ సినిమాలో చాలా ఇంట్రెస్టింగ్ గా ఉండబోతుందట. కాగా, ఇప్పటివరకూ చరణ్ నుంచి వచ్చిన అన్ని చిత్రాల కంటే.. ఈ సినిమా చాలా భిన్నంగా ఉండబోతుందని టాక్. బుచ్చిబాబు రాసిన ఈ సినిమా స్క్రిప్ట్ చాలా భిన్నమైందట. అన్నట్టు 'పెద్ది' వచ్చే ఏడాది మార్చి 27న రిలీజ్ కానుంది. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేంద్రు శర్మ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. మరి పెద్ది సినిమా ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందో చూడాలి. రెహమాన్ ఈ చిత్రానికి స్వరాలు అందిస్తున్నారు.

# పోలీసుల పట్ల ప్రజలకు విశ్వాసం పెరిగింది

- నేరాలపై పోలీసుల ఉక్కుపాదం
- ఆదిలాబాద్ జిల్లాలో తగ్గిన క్రైం రేట్
- గంజాయి నిర్మూలనే లక్ష్యంగా ముందుకు
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్
- జిల్లా వార్షిక క్రైంత రిపోర్ట్ విడుదల




**ఆదిలాబాద్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ జిల్లాలో గత ఏడాది కంటే ఈ ఏడాది నేరాల శాతం గణనీయంగా తగ్గిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ స్పష్టం చేశారు. సోమవారం మధ్యాహ్నం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లా వార్షిక క్రైమ్ రిపోర్ట్ను విడుదల చేశారు పాఠశాలలో, కళాశాలలో విద్యా ర్థులచే యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి పక ద్భందీగా పర్యవేక్షిస్తామ న్నారు. గంజాయి సమూల నిర్మూలనే పోలీసుల లక్ష్యమని స్పష్టం చేశారు. బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్న ఆదివా సుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు, వారి పిల్లల అక్షరాస్యతను పెంపొందించేలా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక కార్యచరణ రూపొందించిందని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో వీడీసీ పేరుతో చట్ట విరుద్ధంగా పనిచేస్తున్న కమిటీలను సమూలంగా నియంత్రించి వారిపై కేసులు కూడా నమోదు చేశామన్నారు. నేరాల కట్టడికి వినూత్న కార్యక్రమాలు.. ఆదిలాబాద్ జిల్లాలో 2025 సంవత్సరంలో నేరాల కట్టడికి పోలీసులు వినూత్న కార్యక్రమాలను చేపట్టి ప్రజాదారణ పొందారు. ఇందులో భాగంగానే సైబర్ క్రైమ్ రేట్‌తో పాటు శాంతి భద్రతల విషయంలో నేరాలు పెరిగినప్పటికీ, దొంగత నాల కేసుల్లో 48 శాతం రికవరీ సాధించామన్నారు. గత సంవత్సరం 12 రోడ్డు ప్రమాదాలు దొరికితే ఈసారి 109 ప్రమాదాలు సంభవించాయని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పోలీస్ శాఖ సంస్కరణలు సత్ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు.మెసేజ్ యువర్ ఎస్పీ, ఆపరేషన్ చబుత్ర, ఆప రేషన్ జ్వాలా, పోలీసు అక్క, అభయ మై టాక్సీ తదితర వినూత్న కార్యక్రమాలతో పోలీసులు ప్రజలకు చేరువవుతున్నారని ఎస్పీ అన్నారు. పాఠశాల విద్యార్థులకు అండగా 'ఖాకి కిడ్స్" కార్యక్రమం 2026లో అమలు చేస్తున్నట్టు తెలిపారు. నూతన సంవత్సరానికి పురస్కరించుకొని రోడ్లపై యువత పూటుగా తాగి,న్యూసెన్ చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని, రోడ్లపై ఎక్కడికక్కడ ఏఆర్ పోలీస్ బలగాలను రంగంలోకి దించుతున్నట్టు ఎస్పీ తెలిపారు.అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన 127 మందిపై రౌండ్ షీట్లు తెరిచినట్లు తెలిపారు.ఏడాది రికార్డు స్థాయిలో 717 మొబైల్ ఫోన్లను రిక వరీ చేశామని,సైబర్ క్రైమ్ నియంత్రణకు పకడ్బందీ ప్రణాళిక అమలు చేస్తున్నట్టు ఎస్పీ తెలిపారు.

**తగ్గిన నేరాలు పెరిగిన కేసులు..**
ఆదిలాబాద్ జిల్లాలో గతేడాది 43 శాతం కేసులు నమో దవగా గతేడాదితో పోలిస్తే 2025లో 36 శాతం కేసులు నమోదయ్యాయి. 2024లో 3979 కేసులు నమోదు కాగా 2025లో 6486 కేసులు నమోదయ్యాయి. ఇందులో హత్య కేసులు 13, కిడ్నాప్ కేసులు 58, రేప్ కేసులు 55, ఫోక్స్ కేసులు 88,ఎస్సీ ఎస్టీ కేసులు 57, ప్రాపర్టీ రికవరీ కేసులు 670 నమోదు కాగా వాటిలో 251 కేసులు చేధించి రూ. 47.18, 176 లక్షల విలువైన ఆస్తిని రికవరీ చేశారు.అదేవి ధంగా సైబర్ నేరాల కేసులు 603 నమోదు కాగా అందులో 194 కేసులను ఛేదించి రూ.49,87,985 లక్షలు రాబ ట్టారు. రోడ్డు ప్రమాదాలు 381 కాగా అందులో 117 మంది మరణించగా..266 మందికి గాయాలైనట్లు ఎస్పీనేర వార్షిక నివేదిక రిపోర్ట్ లో వెల్లడించారు.ఈ మీడియా సమావేశంలో అదనపు ఎస్పీ పి మౌనిక, ట్రైనీ ఐపీఎస్ రాహుల్ కాంత్, డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్ పాల్గొన్నారు.



# 12న శ్రీ కేతేశ్వర కంకాలమ్మ ఆలయ వార్షికోత్సవం

**జన్నారం, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండల కేంద్రసమీపంలోని ఈర్ల గుట్టపై స్వయంబు వెలిసిన శ్రీ కేతేశ్వర కంకాలమ్మ ఆలయ 12వ వార్షికోత్సవ మహాజాతర సోమవారం శ్రీ కేతేశ్వర కంకాలమ్మ ఆలయంలో జరుపుటకు నిర్ణయించడం జరిగిందని ఆలయ కమిటీ ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో అన్నారు కమిటీ చైర్మన్ ఎమ్మార్ నర్సింగరావు మాట్లాడుతూ జనవరి 9,10,11 తేదీల్లో స్వయంభు శ్రీ కేతేశ్వర కంకాలమ్మ మహాజాతర నిర్వహించబడుతుందని తెలియజేశారు, 09/01/2026 శుక్రవారం శివలింగ సహిత హరిహర దేవతలకు పంచామృత అభిషేకాలు తీర్థ ప్రసాదం ధ్వజారోహణము నిర్వహించబడును. తేది10/01/2026 శనివారం శివలింగ సహిత హరిహర దేవతలకు పంచామృతాభిషేకాలు నిర్వహించబడును. తేది11/01/2026 ఆదివారం రోజున స్వామివారి 12వ వార్షికోత్సవ జాతర నిర్వహించబడునని కావున భక్తులందరూ అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చిలువేరు నరసయ్య, పర్ల కనకయ్య, పిల్లి మల్లయ్య, రాజన్న, గోపాల్, అంజయ్య పాల్గొన్నారు.



# జిల్లాకు నూతన శిక్షణ ఐపీఎస్

**ఆదిలాబాద్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
2023 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన రాహుల్ కాంత్ మంగళవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రాహుల్ కాంత్ బీహార్ రాష్ట్రం పాట్నాకు చెందిన వ్యక్తి, ఐఐటి గోవాటి లో కంప్యూటర్ సైన్స్ నందు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, 2023 బ్యాచ్ ఐపీఎస్‌లో నేషనల్ పోలీస్ అకాడమీ హైదరాబాద్‌లో శిక్షణ పొంది 5 నెలల పాటు ఆదిలాబాద్ జిల్లాలో పోలీసు విధులను శిక్షణను తీసుకొనున్నారు.



## మా గ్రామ సమస్యలు
# పరిష్కరించండి సార్..!

**అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత**

**అబ్దుల్లాపూర్ గ్రామ సర్పంచ్ దడిగే జయలలిత భోజన్న**


**లోకేశ్వరం, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
మండలం అబ్దుల్లాపూర్ గ్రామ సర్పంచ్ దడిగే జయలలిత భోజన్న,సోమవారం నిర్మల్ జిల్లా రెవెన్యూ సంస్థల అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అబ్దుల్లాపూర్ గ్రామంలో నెలకొన్న సమస్యలను విన్నవించారు. ముఖ్యంగా గ్రామకంఠం,గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లలు అందేలా చూడాలని, గ్రామ సర్పంచ్ అదనపు కలెక్టర్ కు విన్నవించారు. సానుకూలంగా స్పందించి. గ్రామంలో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని గ్రామకంఠంతోపాటు.రెండో విడతలో.అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంద్రమ్మ ఇండ్లు అందేలా చూస్తామన్నారు. అనంతరం భారీ మెజారిటీతో గెలుపొందిన. అబ్దుల్లాపూర్ సర్పంచ్.ను అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ దడిగే జయలలిత భోజన్నకు శుభాకాంక్షలు తెలిపారు.



# 7వ రోజుకు చేరుకున్న విలేకరుల దీక్షలు

**నిర్మల్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న పాత్రికేయులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి ఏడవ రోజుకు చేరుకున్నాయి. ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలో పాత్రికేయులు పాల్గొని తమ న్యాయబద్ధమైన డిమాండ్ల పరిష్కారం అయ్యేవరకు దీక్షలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. తమ దీక్షలకు వివిధ వర్గాల వారు మద్దతు తెలపడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి లచ్చన్న పాత్రికేయులు పాల్గొన్నారు.




## బెల్లంపల్లి శివారు
# అడవుల్లో పెద్దపులి
### ప్రజల్లో..భయం.. భయం..!

**బెల్లంపల్లి, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి మండలంలోని పెద్దపులి సంచారం బెంబేలెత్తిస్తుంది. పెద్ద బుగ్గ అటవీ ప్రాంతంలో ప్రవేశించిన పెద్దపులి రోజుకు ప్రాంతంలో సంచరించడం కలవరం రేపుతుంది. మండలంలోని చెర్లపల్లి, చంద్రవల్లి అటు ఈ ప్రాంతాల్లో పులి సంచారం సోమవారం వెలుగులోకి వచ్చింది. గత కొద్దిరోజులుగా పెద్దపులి బెల్లంపల్లి పరిసర అటవీ ప్రాంతాల్లో మకాం వేసి ఉండడం ప్రజలను భయాందోళనకు గురిచేస్తుంది. ఈ మేరకు ఫారెస్ట్ అధికారులు పెద్దపులి కదలికలను గుర్తించారు. చంద్రవెల్లి, చర్లపల్లి శివారు ప్రాంతాల్లో పెద్దపులి పాద ముద్రలను గుర్తించారు. పులి సంచారం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ అధికారులు హెచ్చరించారు. బుగ్గ అటవీ ప్రాంతం నుంచి పెద్దపులి మండలం పరిసర అటవీ ప్రాంతం చుట్టూ సంచరిస్తుండటంతో సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ బెల్లంపల్లి ఫారెస్ట్ అధికారులు సూచిస్తున్నారు. పులి సంచారం దృష్టిలో పెట్టుకొని బుగ్గ అటవీ ప్రాంత సమీప గ్రామాలు కన్నాల, లక్ష్మీపురం, చంద్రవల్లి, చర్లపల్లి శివారు ప్రాంతాల గ్రామాల్లో ఫారెస్ట్ అధికారులు ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఇప్పటికే డబ్బు చాటింపు చేశారు. పంట పొలాలకు రైతులు వెళ్లే అప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. అవసరమైతే కానీ రైతులు పంట పొలాలకు గుంపులుగా మాత్రమే వెళ్లారన్నారు. బెల్లంపల్లి మండల పరిధిలో పెద్దపులి సంచారం ఫారెస్ట్ అధికారులను పరుగులు పెట్టిస్తుంది. ఎప్పటికప్పుడూ పెద్దపులి కదలికలను గమనిస్తూ.. ఫారెస్ట్ అధికారులు ప్రజలను మరింత అప్రమత్తం చేస్తున్నారు. ఏదేమైనా మునుపెన్నడూ లేని విధంగా పెద్దపులి సంచారం కలకలం రేపుతున్నది. బెల్లంపల్లి శివారు అటవీ ప్రాంతశివారులో కలకలం రేపుతోంది.










## అరుదైన పక్షులు..

# సుందర దృశ్యాలు..!

**కాలం ఎదైనా సరే ఆయన కెమెరా క్లిక్ మంటుంది.. అక్కడ కనిపిస్తున్న దృశ్యాలు వీక్షకులను కనవిందు చేస్తున్నాయి.. ముఖ్యంగా ఎటు చూసి అరుదైన పక్షులతో అభయారణ్యం కనువిందులు చేస్తోంది. దట్టమైన అడవులు.. ఆ అడవుల్లో స్వేచ్ఛగా విహారించే లేళ్ళు, దుప్పులు, ఇతర వన్యప్రాణులు, కిలకిలరావాలు చేస్తూ రకరకాల పక్షులు ఆకాశంలో ఎగురుతూ, కుంటలు, చెరువులు, చెట్ల కొమ్మలపై వాలుతూ రకరకాల పక్షులు కనివిందుచేస్తూ.. వచ్చిపోయే సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. తాజాగా అడవుల జిల్లాగా పేరుగాంచిన ఆదిలాబాద్ జిల్లాలో నైజీరియా, సౌత్ ఆఫ్రికా, ఇండోనేసియా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ తదితర దేశాలకు చెందిన వివిధ రకరకాల వలస పక్షులు చేరి ఇక్కడి అడవులకు కొత్త అందాలను అద్దుతున్నాయి. వన్య ప్రాణులకు ఆవాసమైన నిర్మల్ జిల్లా కడెం అడవులు ప్రస్తుతం పక్షులకు విడిదిగా మారింది. చాలా దూర ప్రాంతాల నుండి వివిధ రాష్ట్రాలకు చెందిన పలు రకాల పక్షులు శీతాకాలం విడిది కోసం ఇక్కడికి వస్తున్నాయి. ప్రకృతి ప్రేమికులను ఈ పక్షులు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఈ దృశ్యాలను ఆదిలాబాద్ జిల్లాకు చెందిన వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ తన కెమెరాలో బంధించాడు.**



# హృదయ వేదన!

- 40 ఏళ్లు దాటిన ప్రతీ ఒక్కరిలోనూ ఆందోళన
- గ్యాస్ ట్రబుల్ సమస్యనూ హార్ట్ ఎటాక్‌గా భావిస్తున్న వైనం..
- మరణ వార్తలు విన్న వెంటనే డాక్టర్ల చెంతకు..
- సరైన వ్యాయామం లేకపోవడంతో అనారోగ్య సమస్యలు
- ఆందోళన వద్దంటున్న వైద్యులు.. గుండె జబ్బులకు వైద్యం ఉందని భరోసా



**ఆదిలాబాద్, డిసెంబర్ 29(ప్రభాత సమాచారం)**

ఆధునిక జీవనశైలి.. యువతకు పెనుముప్పుగా మారుతోంది. కొంత మంది యువకులు పుట్టుకతో వృద్ధులన్న శ్రీశ్రీ మాట.. ఇప్పుడు అందరికీ వర్తిస్తోంది. ఒత్తిడి, జీవన శైలి, కాలుష్యం..ఇలా కారణాలు ఏమైనా.. చిన్న వయసులోనే శరీరానికి ముసలితనం వచ్చేస్తోంది. పైకి మిలమిలా మెరిసిపోతున్నా.. లోపల అవయవాలన్నీ గుల్లబారిపోతు న్నాయి. రోజుకో గుండెపోటు.. అది కూడా యువతకే ఎక్కువ. ఇటీవల కాలంలో నిత్యం ఇలాంటి ఘట నలే.. ముఖ్యంగా కరోనా తర్వాత యువ గుండెకూ గాయాల పాటు తగులున్నది. 40 ఏళ్ల లోపు వారు సైతం గుండె పోటు బారిన పడటం సర్వత్రా ఆందో ళన కలిగిస్తోంది. ఎవరైనా ఆత్మీయులు గుండెపోటుతో మరణించినా.. సెల బ్రెటీలు అలాంటి మరణాలకు గురైనా చాలా మంది తమలో తాము మదన పడుతున్నారు. ముఖ్యంగా 40 ఏళ్లు నిం డిన వారిలో ఎన్నో సందేహాలు..! అప్పటికీ వైద్య పరీక్షలు పూర్తి చేసుకున్న వారు మరో సారి వైద్యుని వద్దకు వెళుతున్నారు. ఆపేసిన వాకింగ్‌ను తిరిగి మొదలు పెడుతున్నారు. ఆందోళనకు గురైన రోజున.. రేపటి నుంచి ఆహార నియమాలు పాటించడంతో పాటు, శారీరక శ్రమకు తగిన సమయం కేటాయించాలి. దురలవాట్లు మాను కోవాలి.. అంటూ కఠిన నిర్ణయాలు తీసు కుంటున్నారు. కానీ మూడు రోజుల తరువాత మామూలే..! హడావిడిగా వాకింగ్ షూలు కొంటున్నారు. ఓ వారం పాటు వాకింగ్‌కు వెళుతున్నారు. తర్వాత వాటిని వదిలేస్తున్నారు. మళ్లీ ఏదో ఒక వార్త విన్నప్పుడు ఆందోళనలు పడడం సర్వసాధారణంగా మారిపోయాయి. దీనితోడు ఇటీవల కాలంలో రియల్ ఎస్టేట్‌లో వచ్చిన అనూహ్య మార్పులు జిల్లాలో అనేక మంది ఉన్నత తరగతికి చెందిన వారి జీవితాలు తల్లకిందులు చేశాయి. దీంతో ప్రైవేటు ఆసుప త్రుల్లో గుండెపోటుతో చేరే వారి సంఖ్య గణనీ యంగా పెరిగింది. ఇది ఏ స్థాయిలో ఉందంటే ఛాతిలో నొప్పిగా ఉందని ఏ ప్రైవేటు డాక్టర్ వద్దకు వెళ్లినా అడు తున్న మొట్ట మొదటి మాట రియల్ ఎస్టేట్‌లో ఎంత పెట్టుబడులు పెట్టావేంటీ..? అని అడుగుతున్నా రంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. మారుతున్న శారీరక సమస్యలు అందరినీ వ్యాయామానికి దూరం చేస్తున్నాయి. ముఖ్యంగా మహిళలు గతంలో ఇంట్లో వంటి చేసి.. దుస్తులను ఉతికి..పల్లెల్లో అయితే పొలం పనులు కూడా చేసినా అలసిపోయే వారు కాదు. ప్రస్తుతం ఆధునిక ప్రపంచంలో చాలా పనులు ఎలక్ట్రానిక్ మిషిన్లే చేస్తున్నాయి. ముఖ్యంగా జీవితాల్లో వస్తున్న సమ స్యలు ప్రతి ఒక్కరిలోను ఆందోళనలను పెంచుతు న్నాయి. ఈ ఆందోళనల కార ణంగానే కడుపులో యాసిడ్‌లు ఉత్పత్తి జరిగి గ్యాస్ కారణంగా ఛాతీ పట్టే యడం సర్వసాధారణంగా మారుతు న్నాయి. గ్యాస్ వచ్చిన ప్రతిసారీ ఛాతి నొప్పని చెబుతున్న వారి సంఖ్య గణనీ యంగా ఉంది. ఇటీవల కాలంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గత రెండు నెలల వ్యవధిలోనే దాదాపు 15 మంది గుండె పోటుతో మృత్యువాత పడ్డారు. వీరిలో యుక్త వయస్సు గల వారితో పాటు ప్రముఖ వైద్యులు కూడా ఉండడం విస్మయానికి గురిచేస్తోంది.. ఏదైమైనా ఆరోగ్యమే మహాభాగ్యమని అందరూ గుర్తుంచుకోవాలి. ఆరోగ్యం కంటే ఏదీ ముఖ్యం కాదనే విషయాన్ని నమ్మాలి. ఎన్ని డబ్బులు సం పాదించినా.. ఎంత ఉన్నత హోదాలో ఉన్నా.. గుండె పోటు వస్తే ఎవరూ చేసేదేమీ లేదనే విషయం గ్రహించాలి.

# పాత్రికేయులకు న్యాయం చేస్తాం

## జిల్లా గ్రంథాలయ చైర్మన్ సయ్యద్ అర్జున్ అలీ

**నిర్మల్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న పాత్రికేయులకు ఇండ్ల స్థలాలు ఇప్పించే విధంగా కృషి చేస్తామని జిల్లా గ్రంథాలయ చైర్మన్ సయ్యద్ అర్జున్ అలీ, పెన్షన్లు సంఘం జాతీయ కార్యదర్శి లింగన్న, మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తి హామీ ఇచ్చారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో పాత్రికేయులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని సోమవారం సందర్శించి చర్చ లు జరిపారు. ఈ విషయాన్ని జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకు వచ్చామని త్వరలో అన్ని రాజకీయ పార్టీలు ఉద్యోగ సంఘాలతో ఒక సమన్వయ కమిటీ ఏర్పాటు చేసుకొని వారం రోజుల్లో సమస్య పరిష్కరించేలా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఇదిలా ఉండగా ఏడో రోజు దీక్షకు ప్రముఖ వైద్యులు డాక్టర్ రమేష్ రెడ్డి, సిపిఐ నాయకులు విలాస్ రమేష్, ఎస్ఎన్ రెడ్డి, యాదవ సంఘం నాయకులు మనోజ్ యాదవ్, పార్టీ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్, ప్రైవేట్ విద్య కళాశాల నిర్వాకులు వెంకటరెడ్డి, అఖిలేష్ కుమార్, ఉద్యమకార్డు ఇస్మాయిల్ బీఆంఎస్ పార్టీ నేతలు రామకృష్ణారెడ్డి, మార్గొండ రాము తదితరులు సంఘీభావం తెలిపి మద్ద తు పలికారు. ఏడో రోజు దీక్షలో తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు.



# యూరియా కొరత లేదు




- యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి..
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- వీసీలో రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**ఆదిలాబాద్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రంలోని ప్రతి రైతుకు పంట అవసరాలకు సరిపడా యూరియాను తప్పనిసరిగా అందించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం అన్ని జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో యూరియా పంపిణీపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎక్కడా యూరియా కొరత లేదని స్పష్టం చేశారు. యాసంగి పంటకు అవసరమైన మేరకు యూరియా నిల్వలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులకు యూరియా పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, ఎరువుల కొరతపై వస్తున్న పుకార్లను రైతులు నమ్మవద్దని సూచించారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోజువారీగా యూరియా ప్రారంభ, ముగింపు నిల్వల వివరాలను తప్పనిసరిగా నివేదించాలని తెలిపారు. త్వరలోనే అన్ని జిల్లాలలో ఫర్టిలైజర్ బుకింగ్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని, ఇకపై ఉదయం 7 గంటలకు కాకుండా ఉదయం 6 గంటల నుంచే యూరియా అమ్మకాలు ప్రారంభించాలని



మంత్రి తెలిపారు. యూరియా కొనుగోలుకు వచ్చే రైతులకు టెంటు, త్రాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. యూరియా పంపిణీకి సంబంధించి సమస్యలు ఎదురైతే రాష్ట్రస్థాయి హెల్ప్‌లైన్ నంబర్ 1800 599 5779ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పాల్గొని మాట్లాడుతూ, ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను ఈ నెల 22న జిల్లాలో ప్రారంభించామని తెలిపారు. రైతులు, డీలర్లు, వ్యవసాయ అధికారులకు యాప్‌పై వివిధ ప్రసార మాధ్యమాలు, వ్యవసాయ అధికారుల ద్వారా విస్తృత అవగాహన కల్పించామని పేర్కొన్నారు. ఇప్పటివరకు 4,673 మంది రైతులకు 12,735 బ్యాగుల యూరియాను విక్రయించామని, యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని తెలిపారు. ఎరువుల నిల్వలు, సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి రైతులకు సజావుగా యూరియా అందేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ, జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని స్పష్టం చేశారు. రైతుల అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న యూరియాను పకడ్బందీగా పంపిణీ చేయాలని సూచించారు. యూరియా కొరతపై రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పుకార్లను నమ్మవద్దని ఆయన అన్నారు. మండల స్థాయి వ్యవసాయ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు యూరియా పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని, ఖచ్చితంగా ఉదయం 6 గంటల నుంచే యూరియా అమ్మకాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డిప్యూటీ కలెక్టర్ వంశీకృష్ణ, జిల్లా సహకార శాఖ అధికారి మోహన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఈత కొడదామని కాలువలో తోసి.. ప్రాణం తీశారు

**సారంగాపూర్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

ఇంటి వద్ద ఉన్న మేన బావమరిదిని సరదాగా బావ బయటకు తీసుకెళ్లాడు. నీటిలో ఈత కొడదామని కాలువలో తోసి ప్రాణం తీసిన ఘటన నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం స్వర్ణ గ్రామంలో చోటుచేసుకుంది. మేన బావమరిది గెడం కార్తిక్(16) మృతదేహం ఆదివారం స్వర్ణ జలాశయంలో లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండలం మందబొగుడ గ్రామానికి చెందిన గెడం అర్జున్ లలిత దంపతులకు నలుగురు కుమారులు సంతోష్, హనుమంతు, విష్ణు, కార్తిక్‌లు. వీరు కొన్నేళ్ల క్రితం స్వర్ణ గ్రామానికి వలస వచ్చారు. ఈ నెల 25న (గురువారం మధ్యాహ్నం) అర్జున్ సోదరి కుమారుడు పంద్రం గంగాప్రసాద్(21) మరో బాలుడితో కలిసి మేన బావమరిది అయిన కార్తిక్ను బయటికి వెళ్లొద్దామని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లాడు. సమీపంలోని లింగాపూర్ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తూ మార్గమధ్యలో స్వర్ణ జలాశయం వెనక జలాలపై ఉన్న నిర్మల్–సిర్పల్లి రహదారి వంతెనపై కూర్చున్నారు. సరదాగా ఈత కొడదామని నువ్వు ముందా.. నేను ముందు దూకుదామా అంటూ గంగాప్రసాద్ మేన బావమరిది కార్తిక్ అన్నాడు. ఈ క్రమంలో గంగాప్రసాద్ కార్తికు వంతెన పైనుంచి నీళ్లలోకి తోసేశాడు. ఈత రాని కార్తిక్ నీటిలో మునిగిపోయాడు. భయంతో వీరిద్దరూ అక్కడి నుంచి పరారయ్యారు.



సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో తండ్రి అర్జున్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం బాలుడి అదృశ్యం కింద కేసు నమోదు చేసిన సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్ అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. అనుమానం వచ్చి కార్తిక్ మేనబావ అయిన గంగాప్రసాద్ను విచారించగా విషయాన్నంతా పోలీసులకు తెలిపారు. నిర్మల్ ఇన్చార్జి సీఐ గోవర్ధన్ రెడ్డి పర్యవేక్షణలో శుక్రవారం నుంచి జాలర్లు, గజ ఈతగాళ్లతో గంగాప్రసాద్ సూచించిన స్థలంలో గాలింపు చేపట్టగా వంతెన కింద ఇరుక్కున్న కార్తిక్ మృతదేహాన్ని ఆదివారం బయటకు తీశారు. శవపరీక్ష నిమిత్తం నిర్మల్ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. కార్తిక్ మృతికి కారణమైన గంగాప్రసాద్తో పాటు మరో బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం రాత్రి నిర్మల్లోని న్యాయమూర్తి నివాసంలో హాజరు పరచగా గంగాప్రసాద్కు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. బాలుడిని జువైనల్ జస్టిస్ బోర్డు ముందు హాజరు పరిచినట్లు వెల్లడించారు. అర్జున్ పెద్ద కుమారుడు గతేడాది సంతోష్ విద్యుదాఘాతంతో మృతి చెందగా తాజాగా చిన్న కుమారుడి మృతితో ఆ కుటుంబం దుఃఖసాగరంలో మునిగి పోయింది.



# మార్కెట్లో రైతులు పడిగాపులు

## అసెంబ్లీలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**బోథ్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

రైతులు పంట అమ్ముకోవడానికి పడుతున్న కష్టాలను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అసెంబ్లీలో లేవనెత్తారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ... బోథ్ నియోజకవర్గంలోని మార్కెట్ యార్డులలో సోయా, మొక్క జొన్నలు 10వేల క్వింటాళ్లకు పైగా ధాన్యం పేరుకుపోయిందని పంటను అమ్ముకోవడానికి మార్కెట్‌లో రైతులు పడిగాపులు పడుతున్నారన్నారు. వెంటనే పంటలను కొనుగోలు చేయాలని కోరారు. అలాగే వెనుకబడిన బోథ్ నియోజకవర్గంలో గిరిజన బిడ్డలకు ప్రభుత్వం ఏర్పాటు చేయదలచిన ఇంటిగ్రేటెడ్ పాఠశాలను బోథ్‌లో ఏర్పాటు చేయాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బోథ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చినప్పుడు బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా చేస్తానని హామీ ఇచ్చారని, ఆ హామీ మేరకు బోథ్‌ను రెవిన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరారు.

# స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

**ఆదిలాబాద్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

కాంగ్రెస్ పార్టీ శ్రేణులు స్థానిక ఎన్నికలకు పూర్తి స్థాయిలో సంసిద్ధం కావాలని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ పిలుపునిచ్చారు. డీసీసీ కార్యవర్గ ఏర్పాటు పరిశీలకులుగా హాజరైన ఆయన సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంక్రాంతి పండుగ తర్వాత మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికే షన్ వచ్చే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుం టుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కమిటీతో పాటు అనుబంధ సంఘాల ఏర్పాటుకు పార్టీశ్రేణుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను మంగళవారం పీసీసీ అధ్యక్షుడికి అందజేస్తామన్నారు.





## ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు

# ఎత్తి వేయాలని ఎస్పీకి వినతి

**ఆసిఫాబాద్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

ఆర్టీసీ డ్రైవర్ రామారావుపై పెట్టిన కేసును ఎత్తివేసి, బెయిల్ మంజూరు చేయాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో ఎస్పీ నితికా పంత్‌కు వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, ఎఫ్‌సీఐ బోర్డు సభ్యుడు తిరుపతి మా ట్లాడుతూ ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే డ్రైవర్‌పై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారని ఆరోపించారు. డిపో మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మ కూరి చిరంజీవి, ఐటీయూసీ డిపో అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి మోహన్ బాబు, డ్రైవర్ రామా రావు భార్య శారద, కార్మికులు ప్రవీణ్, గోపి, కృష్ణ, తిరుపతి, రాజలింగ్, వెంకటేశ్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

# కూచిపూడి నృత్య కళలో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్



**మందమర్రి, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియం హైదరాబాద్‌లో కూచిపూడి నృత్య కళాకారులు దాదాపుగా మూడు రాష్ట్రాల నుండి సుమారుగా 4608 మంది కూచిపూడి నాట్య కళాకారులు హాజరయ్యారు. అనంతరం ఒకే వేదికపై 4608 మంది సోమవారం కూచిపూడి ఒకేసారిగా కూచిపూడి నాట్య కళాకారులు నృత్యం చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కించుకున్నారు. దీనిలో భాగంగా మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని శ్రీసాయి నాట్య కళానిలయం శిక్షకురాలు అశ్విని టీం నుండి కోటేశ్వరావుపల్లే కి చెందిన చింతకింది రాజేశం విజయ దంపతుల కూతురు సహస్ర , మందమర్రిలోని మహాత్మ జ్యోతి పులే గురుకుల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న బాలిక మిత్ర బృందంతో హైదరాబాదులోని గచ్చిబౌలి స్టేడియంలో కూచిపూడి నృత్య కళా నైపుణ్యాన్ని ప్రదర్శించడం జరిగింది. కార్యక్రమంలో మూడు రాష్ట్రాలకు సంబంధించిన కళాకారులు హాజరయ్యారు.



## ప్లాస్టిక్ విక్రయిస్తున్న షాపులకు జరిమానా

**ఆదిలాబాద్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

పర్యావరణానికి హానికలిగించే ప్లాస్టిక్‌ను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ బైరి శంకర్ హెచ్చరించారు. ఆదిలాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లోని ప్లాస్టిక్ హోల్ సేల్ దుకాణాలలో అధికారులు సోమవారం తనిఖీలు జరిపి దాదాపు 2 క్వింటాళ్ల ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తున్న దుకాణదారులకు జరిమానాలు విధించారు. దుకాణదారులు 120 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్‌ను విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఇందులో మున్సిపల్ అధికారులు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి



**నార్నూర్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నాణ్యత పాటించేలా చూడాలని గాదిగూడ ఎంపీడీవో శ్రీనివాస్ సదరు కాంట్రాక్టర్‌లకు సూచించారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం అర్జుని గ్రామపంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు తమ ఇండ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించడంలో నిర్లక్ష్యం చేయకుండా చూడాలన్నారు. ఇండ్ల నిర్మాణంలో నాణ్యమైన ఇసుకను వాడేలా చూడాలని గుత్తేదారులకు ఆదేశించారు. అలాగే పనులు వేగవంతం చేసి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కమల, పంచాయతీ కార్యదర్శి రవి, లబ్ధిదారులు ఉన్నారు.

## ఖాందేవ్ జాతరకు రావాలని జిల్లా కలెక్టర్‌కు ఆహ్వానం



**నార్నూర్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలో జనవరి 2న ప్రారంభం కానున్న శ్రీశ్రీశ్రీ ఖాందేవ్ జాతరకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షాను తోడసం వంశస్థులు, ఆదివాసి పెద్దలు సోమవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా జాతర గోడపత్రులను ఆవిష్కరింపజేశారు. ఖాందేవ్ పుణ్య క్షేత్రంలో మహా పూజ శనివారం ఉదయం తోడసం వంశస్తుల ఆడపడుచు మూడు కిలోల నువ్వుల తైలం తాగే మహోన్నత కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు. అనంతరం దర్బార్ ఉంటుందని ఈ కార్యక్రమానికి రావాలని కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రూప్ దేవ్, జాతర నిర్వాహ కులు నాగోరావు, మాజీ సర్పంచ్ మోకాలి రూప్ దేవ్, ఇస్రూ, బాదిరావు. తోడసం వంశీయులు ఉన్నారు.

# గత ఏడాదితో పోలిస్తే నేరాలు పెరిగాయి

- నేర రహిత సమాజం దిశగా చర్యలు
- కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నీతికా పంత్
- వార్షిక నేర నివేదిక విడుదల చేసిన ఎస్పీ



**ఆసిఫాబాద్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో పోలీసుల తనిఖీలు పెద్ద ఎత్తున పెరగడంతో 2024తో పోలిస్తే 2025లో నేరాల సంఖ్య పెరిగిందని జిల్లా ఎస్పీ నీతికా పంత్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీపీఓ కార్యాలయంలో కాగజ్‌నగర్ డీఎస్పీ వహీబుద్దీన్‌తో కలిసి ఆమె వార్షిక నేర నివేదిక ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 2024లో జిల్లాలో 1,207 సాధారణ నేరాలు నమోదుకాగా, 2025లో అవి 1,934కు పెరిగాయని, ఇది 60.23 శాతం వృద్ధిగా పేర్కొన్నారు. నేరాల సంఖ్య పెరగడానికి పోలీసుల విస్తృత తనిఖీలు, నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్, వరకట్న వేధింపులు, గృహహింస వంటి అంశాలే కారణాలని విశ్లేషించారు. నేరాల నియంత్రణ కోసం అవగాహన కార్యక్రమాలకు పెద్దపీట వేస్తూ కలబృందాల ద్వారా 151 కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల నుంచి నేరుగా 232 పిటిషన్లు స్వీకరించగా, అందులో 220 పిటిషన్లను పరిష్కరించినట్లు చెప్పారు. గ్రామీణ పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి 278 గ్రామ పోలీస్ అధికారులను నియమించినట్లు వివరించారు. నేరాల నియంత్రణే లక్ష్యంగా ప్రతి పోలీస్ స్టేషన్ను చిన్నచిన్న విభాగాలుగా విభజించి, హాట్‌స్పాట్ ప్రాంతాలను గుర్తించి నిరంతర తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. వాహన తనిఖీలలో 3,757 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, వాటి ద్వారా ప్రభుత్వానికి రూ.1,04,526 జరిమానా వసూలు చేసినట్లు వెల్లడించారు. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కార్డెన్ సెర్చ్, నాకాబందీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, జిల్లాలో కమ్యూనిటీ పోలీసింగ్‌ను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నామని తెలిపారు. పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 143 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు పేర్కొన్నారు. మహిళల రక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ షీ టీమ్స్ ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నామని, బాధిత మహిళల కోసం భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసి 43 మందికి ఆశ్ర యం కల్పించినట్లు చెప్పారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, గత ఏడాది 315 పిటిషన్లు స్వీకరించగా 37 ఎఫ్ఐఆర్లు నమోదు చేశామని తెలిపారు. సైబర్ మోసాల ద్వారా రెండు కోట్ల రూపాయలకుపైగా నష్టం జరగకుండా అడ్డుకోవడంతో పాటు రూ.4,78,000 తిరిగి బాధితులకు చెల్లించామని, రూ.17 లక్షలకుపైగా నగదును నిలిపివేసినట్లు వెల్లడించారు. నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్ కారణంగా జిల్లాలో 267 రోడ్డు ప్రమాదాలు సంభవించాయని తెలిపారు. కోర్టుల ద్వారా శిక్ష పడిన కేసులు గత ఏడాది 48 ఉండగా, ఈ ఏడాది 46గా ఉన్నాయని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద 38 కేసులు నమోదు కాగా, ఇతర ఐపీసీ/బీఎన్ఎస్ కేసులు 1,095 నమోదైనట్లు వివరించారు. మహిళలపై గృహహింస, హత్య, హత్యాయత్న కేసులు గత ఏడాది 99 కాగా, ఈ ఏడాది 106కు చేరాయని తెలిపారు. గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో దాడులు నిర్వహించి 73 కేసులు నమోదు చేసి 122 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. చిన్నపిల్లల రక్షణే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాల ద్వారా 105 మంది పిల్లలను రక్షించినట్లు తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా 4,118 కేసులను పరిష్కరించినట్లు వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 100కు డయల్ చేయాలని సూచించారు. అవగాహన లోపంతో ప్రజలు నిబంధనలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక అక్రమ రవాణా నివారణకు చర్యలు తీసుకుంటున్నామని, దొంగతనాల రికవరీ రేటు పెంచేందుకు అన్ని విధాల చర్యలు చేపట్టామని తెలిపారు. మావోయిస్టులకు సంబంధించిన అంశాలు రాష్ట్ర పోలీస్ శాఖ పరిధిలో ఉంటాయని స్పష్టం చేశారు.

**కొత్త సంవత్సర వేడుకలపై సూచనలు...**

వార్షిక నేర నివేదిక విడుదల సందర్భంగా పత్రికా విలేకరుల ప్రశ్నలకు స్పందించిన జిల్లా ఎస్పీ నీతిక పంత్ జిల్లాలోని లాడ్జీలు, ఫంక్షన్ హాల్స్లో తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఎక్కడైనా అక్రమ కార్యక్రమాలు నిర్వహిస్తే కఠి న చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవైనా వేడుకలు నిర్వహించాలంటే ముందస్తుగా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడి పితే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కొత్త సంవత్సరానికి సంబంధించి మద్యం దుకాణాల మూసివేత సమయాలు సహా ఇత ర నిబంధనలు రాష్ట్ర పోలీస్ శాఖ ఆదేశాల మేరకు అమలు చేస్తామని తెలిపారు. అనంతరం గంజాయి సహా ఇతర మాదకద్రవ్యాల నియంత్రణలో విశేష కృషి చేసిన జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన 31 మంది సిబ్బందికి తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో అందించిన రివా ర్డులను ఎస్పీ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సైన్స్ విజ్ఞానంతోనే సమాజం అభివృద్ధి



**నిర్మల్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

సైన్స్ విజ్ఞానంతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. సోమవారం కొండాపూర్ సెంటమ్స్ హైస్కూల్లో జిల్లా విద్యాశాఖా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రారంభించారు. ఈ సం దర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసి ఆయా ప్రభుత్వ పాఠశాల ప్రైవే ట్ పాఠశాల విద్యార్థులు సైన్స్ విజ్ఞానం తెలియజేసే ప్రదర్శనలు ఏర్పాటు చేశారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి దర్శనం భోజన ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మెసాలపై అప్రమత్తంగా ఉండాలి

### నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల

**నిర్మల్,డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లాలో సైబర్ నేరాలు పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో సైబర్ నేరాలు డిజిటల్ అరెస్ట్‌ల నేపథ్యంలో 'ఫ్రాడ్ కాఫుల్ స్టాప్' పోస్టర్లను ఎస్పీ ఆవిష్కరించారు. సైబర్ డిజిటల్ నేరాలు జరగడానికి గల కారణాలను గురించి వాటిని దూరంగా ఉంచుకునేందుకు ప్రజలు చర్యలు తీసుకోవాలని అన్నారు. సైబర్ నేరానికి గురైతే 1930కి వెంటనే కాల్ చేయాలని సూచించారు డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో ఫోన్ కాల్ వస్తే పోలీసులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటరమణ శ్రావణి పాల్గొన్నారు.





## సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహా ఆవిష్కరణ

**మామడ, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని మామడ మండలం దిమ్మదుర్తి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్ర హాన్ని సోమవారం ఆవిష్కరించారు. తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు అమరవేణి నరస గౌడ్ బీఆర్ఎస్ జిల్లా సమన్వయకర్త రామ్ కిషన్ రెడ్డితో పాటు గౌడ సంఘం నాయకులు ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు శ్రీనివాస్ గౌడ్ దశ గౌడ్, రామగిరి గౌడ్ పాల్గొన్నారు.

## తాంసి మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షునిగా అరుణ్

**తాంసి, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

తాంసి మండలం సర్పంచ్‌ల సంఘం నూతన అధ్యక్షునిగా గంద్రత్ అరుణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని సర్పంచ్‌ల సమావేశంలో ఎన్నుకున్నారు. సంఘం ఉపాధ్యక్షునిగా జయసుధ, ప్రధాన కార్యదర్శిగా మతిన్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారిని శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# ‘ముక్కోటి’కి ఆలయాల ముస్తాబు



■ ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు ■ భక్తుల రద్దీ దృష్ట్యా బారికేడ్ల ఏర్పాటు

**మంచిర్యాల, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని వైష్ణవ ఆలయాలు ముస్తాబయ్యాయి. భక్తుల ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంచిర్యాలలోని విశ్వనాథ స్వామి ఆలయ ప్రాంగణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి పూజా కైంకర్యా లు ఏకాంతంగా నిర్వహించిన అనంతరం మంగళవారం వేకువజామున ఐదు గంటల నుంచి వేంకటేశ్వరుడి ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయం చుట్టూ ప్రత్యేకంగా ఇనుప బారికేడ్లతో క్యూలైన్లు, టెంటు ఏర్పాటు చేశారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశామని, తాగునీటి సౌకర్యం కల్పించామని ఆలయ ఈవో రవి తెలిపారు. అదే విధంగా చెన్నూరులోని అత్యంత ప్రాచీన జగన్నాథ ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 400ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఆలయం ఒడిశా రాష్ట్రంలోని పూరిలో ఉన్న జగన్నాథ ఆలయం తర్వాత రెండోదిగా పేరొందింది. పూరిలోని ఆలయం మాదిరిగానే ఇక్కడా పూజలు నిర్వహించడం గమనార్హం. ముక్కటి ఏకాదశి సందర్భంగా గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణ వేడుకలు నిర్వహిస్తారు. అలాగే మందమర్రి పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వేడుకలకు ఆలయ నిర్వాహకులు ఘనంగా ఏర్పాట్లు చేశారు.



## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

**ఆసిఫాబాద్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 10 మంది విద్యార్థులు, మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న 8 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు.వరంగల్ జిల్లాలో ఈ నెల 30వ తేదీ నుంచి జనవరి 1వ తేదీ వరకు జరగనున్న సీనియర్ బాలబాలికల రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలలో వీరు పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కనక కర్నూ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను డీవైఎస్ఓ అష్ఫాక్ అహ్మద్, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్. రమాదేవి, ఆసిఫాబాద్ జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి దుర్గం గురువేందర్, గిరిజన క్రీడల అధికారి షేకు, ఏసీఎంఓ ఉద్ధవ్, జీసీడీఓ శకుంతల, ఏటీడీఓ శివకృష్ణ, హెచ్డబ్ల్యూఓ మధుకర్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శారద, పీడీలు మధుసూదన్, హారిక, కోచ్లు రాకేష్, విద్యాసాగర్, తిరుమల్, అరవింద్, రవి, యాదగిరి అభినందించారు.

## నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

**ఇచ్చోడ, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఈజీఎస్ ఏపీవో నరేందర్ గౌడ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో 2024 ఏప్రిల్ నుంచి మార్చి 2025 వరకు చేపట్టిన ఉపాధి పనులపై 15వ విడత సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు. 15 రోజుల నుంచి పంచాయతీల వారీగా గ్రామసభలు నిర్వ హించినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులుప్రజావేదికను విజయవంతం చేయాలన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధం

### ఓటర్ల జాబితా తయారీకి ఈసీ ఆదేశం

**ఆదిలాబాద్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమవుతోంది. ఆదిశగా ఎన్నికల సంఘం దృష్టి సారించింది. కీలకమైన ఓటర్ల జాబితా తయారీకి ఆదేశాలు జారీ చేసింది. ఫిబ్రవరి రెండో వారంలోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలనే ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కసరత్తు షురూ చేసింది. ప్రతీ ఓటరు ఓటు హక్కు వినియోగించుకునేలా ఓటర్ల జాబితా తయారీకి సంబంధించిన షెడ్యూల్ను సోమవారం విడుదల చేసింది. వచ్చే ఏడాది జనవరి 10న పోలింగ్ కేంద్రాలు, వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితా ప్రకటించనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు పట్టణంలో రాజకీయ వేడి మొదలైంది. ఈనెల 30న పోలింగ్ కేంద్రాల వివరాలు, 31న వార్డుల వారీగా, జనవరి 1న కేంద్రాల వారీగా ఓటర్ల జాబితా ప్రకటించి అభ్యంతరాలు స్వీకరించ నున్నారు. 5న గుర్తింపు పొందిన ప్రధాన రాజకీయ పార్టీలు, ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వివరాలు వెల్లడించనున్నారు. 6న కలెక్టర్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల సమావేశం నిర్వహిస్తారు. 10న ఓటర్ల తుది జాబితా ప్రకటించనున్నారు.

# సంక్రాంతికి ‘గూడెం ఎత్తిపోతల’ నీరు

**దండేపల్లి, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

మండలంలోని గూడెం సత్యనారాయ ణస్వామి ఎత్తిపోతల పథకం ద్వారా దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లోని కడెం ఆయకట్టు పరిధిలో డీ-30 నుంచి 42వరకు ప్రతియేటా సాగునీరందిస్తున్నారు. ఈసారి యాసంగి సీజన్ సాగుకు సంబంధించి సంక్రాంతి పండుగ నుంచి నీటి విడుదలకు అధికారులు చర్యలు చేపట్టారు. 2021, 2022లో గోదావరి వరద నీటిలో కంట్రోల్ ప్యానల్ గది మునిగిపోవడం, కొంత సామగ్రి పాడవడం తెలిసిందే. ఆ సమయంలో మరమ్మతులు చేయించారు. కంట్రోల్ ప్యానల్ వరద నీటిలో మునిగిపోకుండా ఉండేందుకు ఎత్తయిన ప్రదేశంలో రూ.1.59 కోట్లతో కొత్తగా గది నిర్మించారు. ప్రస్తుత గదిలోని సామగ్రిని అందులోకి మారుస్తున్నారు. శరవేగంగా సాగుతున్న పనులన్నీ సంక్రాంతి వరకు పూర్తి చేసి నీటి విడుదలకు ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. పనులు పూర్తవగానే ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆదేశాల మేరకు నీటి విడుదల తేదీని ప్రకటిస్తామన్నారు.

# యువ పురస్కార్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

**మంచిర్యాల, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో యువ పురస్కార్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంచిర్యాల పట్టణ సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, యువజన అవార్డు గ్రహీత వలస సుభాష్ చంద్రబోస్ తెలిపారు. యువజన సంఘాలకు, మహిళా సంఘాలకు రాష్ట్రస్థాయి సంకల్ప యువ పురస్కారం అవార్డుల ప్రధాన ఉత్సవ కార్యక్రమం హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. యువజన, మహిళ సంఘాల ద్వారా వారు చేసిన సామాజిక, సేవ రంగాలలో ప్రతిభ కలిగిన వారికి రాష్ట్రస్థాయి సంకల్ప యువ పురస్కార్ అవార్డులు ప్రధానం చేస్తున్నట్లు వెల్లడించారు. జనవరి 15 లోపు వారు చేసిన సామాజిక, సేవా కార్యక్రమాల ఫోటోలు, ప్రెస్ క్లిప్పింగులు, వారికి వచ్చిన మెరిట్ సర్టిఫికెట్లు దరఖాస్తుకు జత చేసి పోస్ట్ ద్వారా పంపించాలని సామాజిక సేవారంగంలో ప్రతిభగల యువజన సంఘాలను మహిళా సంఘాలను కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు వలస సుభాష్ చంద్ర బోస్, వ్యవస్థాపక అధ్యక్షులు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ, ఇంటి నెంబర్ 2-92, సిద్దిపేట జిల్లా కోహెడ మండలం కూరెల్ల గ్రామం, పిన్ 505473కి పంపించాలని కోరారు.



## వేతనాల కోసం మున్సిపల్ కార్మికుల ధర్నా

**నిర్మల్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

బైంసా మున్సిపాలిటీలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచి వారి సమ స్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సిఐటియు మున్సిపల్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అన్ని మున్సిపాలిటీలో వేతనాలు పెంచిన బైంసా మున్సిపల్ లో వేతనాలు పెంచడం లేదని వేదానాల కోసం ఆందోళన నిర్వహిస్తే పనిలో నుంచి తీసివేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు వెంటనే జోక్యం చేసుకొని న్యాయం చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జేసీకి అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేష్, మున్సిపల్ కార్మికులు ఆరీఫ్, వినోద్, సుశీల్, లక్ష్మి పాల్గొన్నారు.

## విహారయాత్రకు వెళ్లి తిరిగిరాని లోకాలకు

### పెద్దవాగులో నీటమునిగి యువకుడు మృతి

**కాగజ్‌నగర్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**



విహారయాత్రకు వెళ్లిన యువకుడు నీటమునిగి తిరిగి రాని లోకాలకు వెళ్లిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల మేరకు మండలం ఏ-1కు చెందిన మంజిత్ మండల్ (35)ఆదివారం గ్రామానికి చెందిన కొంతమందితో కలిసి విహార యాత్ర కోసం జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు వద్దకు వెళ్లాడు. అక్కడ విందు చేసుకున్న అనంతరం మృతుడు చేపలు పట్టేందుకు వలతో నీటిలోకి దిగాడు. లోతు ఎక్కువ ఉండడంతో వలలో చిక్కుకుని గల్లంతయ్యాడు. రాత్రి వరకు గాలించినప్పటికీ ఆచూకీ లభించ కపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం గజఈతగాళ్లతో వెతికించడంతో మృత దేహాన్ని వెలికి తీశారు. కూలీ పని చేసుకుని జీవనం సాగించే మంజిత్ మండల్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మండల్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అందరినీ కంట తడిపెట్టించింది. మృతుని సోదరుడు సుజిత్ మండల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# గుండెపోటుతో రిమాండ్ ఖైదీ మృతి

మృతుడిది నిర్మల్ జిల్లా కేంద్రం - విచారణ చేపట్టిన ఆర్డీవో మధుసూదన్
- కేసు నమోదు చేసిన పట్టణ సీఐ కరుణాకర్
- కుటుంబ సభ్యులకు సమాచారం - కృష్ణపై 50కిపైగా కేసులు..

**నిర్మల్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

జగిత్యాల సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న నిర్మల్ జిల్లాకు చెంది కోతల్ కృష్ణ (43) గుండెపోటుతో మృతిచెందాడు. కృష్ణ జగిత్యాల పట్టణంలోని మార్కండేయనగర్‌కు చెందిన ఎక్కలేవి కృష్ణ వద్ద రూ.70వేలు తీసుకున్నాడు. అనంతరం రెండు ఫోన్ నంబర్ల ద్వారా కృష్ణ సెల్‌ఫోన్‌కు ఫోన్‌పే చేయించాడు. ఆ రెండు నంబర్లు సైబర్ క్రైంకు సంబంధించినవి కావడంతో కృష్ణ బ్యాంక్ ఖాతా ఫ్రీజ్ అయ్యింది. బాధితుడు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు నవంబర్ 3నకోత్వల్ కృష్ణను అరెస్ట్ చేసి జగిత్యాల స్పెషల్ జైలుకు తరలించారు. ఈ క్రమంలో కృష్ణ సోమవారం ఉదయం ఛాతిలో నొప్పిగా ఉందని జైలు సిబ్బందికి తెలపడంతో జైలు సూపరింటెండెంట్ మొగిలేశ్ ఎస్కార్ట్ సిబ్బందితో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు ప్రయ త్నించినా ఫలితం లేకుండాపోయింది. ఆయన మృతి వార్తను సబ్ జైలర్ ఉన్న తాధికారులు, కుటుంబ సభ్యులకు తెలిపారు. ఆర్డీవో మధుసూదన్, రెండో అదనపు జుడిషియల్ మేజిస్ట్రేట్ నిఖిష ఆస్పత్రికి చేరుకు ని విచారణ చేపట్టారు. జైలు సూపరింటెండెంట్ మొగిలేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో తీవ్రంగా రోధించారు. కృష్ణపై సూర్యపేట, ములుగు, కొత్తగూడెం, హైదరాబాద్, నిజామాబాద్, ఆర్మూర్‌లో పలు కేసులున్నాయి. నిర్మల్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు ఉంది. అతడిపై సుమారు 50 కేసుల వరకు ఉన్నట్లు సమాచారం.





# నా కొట్లాట అంతా జంగ్లాతోల్లాతోనే అధ్యక్షా..!

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు అడ్డుకొంటున్నారు.. రైతులను వేదిస్తున్నారు**

**అసెంబ్లీలో అటవీ శాఖపై మండి పడ్డ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్**

**ఉట్నూర్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

అధ్యక్షా.. నా నియోజకవర్గంలో విస్తరించివున్న ఖవ్వాల టైగర్ రిజర్వ్‌లో అటవీ అధికారుల ఆగడాలు మితిమీరిపోయాయి.. ప్రజలను తీవ్రంగా ఇబ్బందులు పెడుతున్నారు.. ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోకుండా పేదలను ఇబ్బంది పెడుతున్నారు.. ప్రతి రోజు నేను జంగ్లాతోల్లాతోనే కొట్లాడాల్సి వస్తుంది అధ్యక్షా.. అంటు ఖానాపూర్ శాసనసభ్యుడు వెడ్మ భోజ్జు పటేల్ సోమవారం అసెంబ్లీలో అటవీ శాఖ పై మండి పడ్డారు. అటవీ ప్రాంతంలో చాలా కాలంగా మనుగడ సాగిస్తున్న కొలాం గిరిజనులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులు కట్టుకోకుండా అటవీ అధికారులు నిర్మాణా లను అడ్డుకోవడంతో ఉన్న ఇండ్లను కూలగొట్టుకొని కొత్త ఇల్లు ఆగిపోవడంతో పేద గిరిజనులు గూడు లేక కష్టాలు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఇండ్ల నిర్మాణాలు అడ్డుకోకుండా అటవీ శాఖకు ఆదేశాలు ఇవ్వాలని కొరారు.రైతులు పత్తి పంటను అమ్ముకోవడానికి మార్కెట్ వెళ్లేందుకు రోడ్డు సరిగ్గా లేకపోవడంతో రోడ్డు పై కంకర వేసి వెళ్లే ప్రయత్నం చేసిన ఇస్లాంపూర్ రైతులను అటవీ అధికారులు అడ్డుకోవడమే కాకుండా జెసిబితో రోడ్డుపై చేసారని ఎమ్మెల్యే ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారు.ఇదే కాకుండా పోడు రైతులను వేదించడం అటవీ అధికారులకు అలవాటు అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేసారు. తన నియోజకవర్గంలో అటవీ అధికారుల వేధింపులను అరికట్టి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

# బేల మార్కెట్ యార్డులో రైతుల వినూత్న నిరసన



**బేల, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా బేల మార్కెట్ యార్డులో మోకాళ్లపై కూర్చొని రైతు లు వినూత్న నిరసన చేపట్టారు. 15 రోజులుగా పంట అమ్మకానికి రైతులు పడిగాపులు కాయగా మార్క్‌ఫెడ్ అధికారులు ఇటీవల కొను గోలు కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన పంటను అధికారులు నాఫెడ్ గోదాములకు తరలించగా అక్కడ అధికారులు పంటను తిరస్కరించారు. దీంతో రైతులు తమ పంటను తిరిగి ఇంటికి తీసుకెళ్లారు. ప్రభుత్వం నామాత్రంగా కొనుగోళ్లు చేస్తుందని, నిబంధనల పేరుతో రైతులను వేధింపులకు గురిచేస్తుందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోయాబీన్ పంటను కొనుగోలు చేయాలంటూ ఆందోళనలు చేసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం ఫలితంగా రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు పంటను విక్రయించి నష్టపోవాల్సి వస్తుందన్నారు. యాసంగి పెట్టుబడుల కోసం తాము ప్రైవేట్ వ్యాపారులకు పంటను విక్రయిస్తున్నట్లు రైతులు తెలిపారు.

# కేస్లాపూర్‌కు చేరిన ప్రచార రథం



**ఇంద్రవెల్లి, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

పుష్యమాస అమావాస్యను పుష్కరించుకుని జనవరి 18న నాగోబా ఆలయంలో నిర్వహించే మహాపూజతో పాటు జాతర నిర్వహణపై ఈ నెల 23న కేస్లాపూర్‌లోని నాగోబా మురాడి నుంచి ప్రారంభమైన మెస్రం వంశీయుల ప్రచార కార్యక్రమం సోమవారం ముగిసింది. మండల కేంద్రంలోని గోండుగూడలో మెస్రం వంశీయులు ఎడ్లబండికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయంత్రం ప్రచార రథం కేస్లాపూర్ గ్రామానికి చేరుకోగా వారి ఆచారం ప్రకారం రాత్రి మడావి వంశీయుల ఇంట్లో బస చేశారు. మంగళవారం ఉదయం నాగోబా మురాడికి చేరుకుని మధ్యాహ్నం ఉమ్మడి జిల్లా మెస్రం వంశీయులతో సమావేశమై పవిత్ర మైన గంగాజల సేకరణ పాదయాత్రను ప్రారంభించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావ్ తెలిపారు. ఈ ప్రచార ముగింపు కార్యక్రమంలో కటోడ మెస్రం హనుమంతావ్, మెస్రం కోసేరావ్, దేవావ్, పర్ధాన్ మెస్రం దాదారావ్, తదితరులు పాల్గొన్నారు.



## కార్పొరేట్ స్థాయి వైద్యం

# అందించడమే లక్ష్యం

## మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు

**మంచిర్యాల, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

జిల్లా ప్రజలకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకేళ్తున్నట్లు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరాస్తాలో జరు గుతున్న ప్రభుత్వ సూపర్ స్పెషాలీలటీ ఆసుపత్రి నిర్మాణ పను లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ ప్రతీ వైద్యానికి ప్రజలు హైదరాబాదుకు వెళ్లాల్సి వస్తుందని ఆ అవసరం ఉండకూడదనే ఉద్దేశంతో రూ.324 కోట్లతో సూపర్ స్పెషాటీలీ ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. 2027 లోగా ఆసు పత్రి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు వైద్య సేవలను అందుబాటు లోనికి తేనున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ త్వరిత గతిన పూర్తి అయ్యేలా చర్య లు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలో వైవ్యసేవలు అందుబాటులోనికి వస్తే జిల్లాతో పాటూ పొరుగు జిల్లా అయిన ఆసి ఫాబాద్, మహారాష్ట్ర ప్రజలకు నాణ్యమైన, ఉచిత వైద్య సేలవలు అందుతాయన్నారు. ఈ సంర్భంగా ఆసుపత్రి నమూనా, ఇతర సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.. అంతకు ముందు గోదావరి రోడ్‌లో నిర్మించిన అధునాతన వైకుంఠ ధామాన్ని స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే పరిశీలించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


## విలేకరులు కావలెను

ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.

సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక

9440977660, 9110718194

PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY




# మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు

**మంచిర్యాల, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

జనవరిలో జరిగే మేడారం సమ్మక్క సారలమ్మ జాతర కోసం ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలోమన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో సంబంధిత నాలుగు జిల్లాల డీఎంలు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారం జాతరకు ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. చెన్నూరులో 70 బస్సులను, ఆసిఫాబాద్ లో 10, బెల్లంపల్లిలో 79, శ్రీరాంపూర్‌లో 45, మందమర్రిలో 50, మంచి ర్యాలలో 117 బస్సులు మొత్తం 369 బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం మేడారానికి వెళ్లి వచ్చే ప్రయాణికుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందన్నారు. ప్రతి ఒక్కరు ఐక్యంగా పనిచేసి ఆర్టీసీ యాజమాన్యానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో అ వసరమని, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు అంకిత భావంతో పనిచేయాలన్నా రు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, ఏమైనా సమస్యలుంటే సంస్థ దృ ష్టికి తీసుకురావాలన్నారు. డివిజన్ మొత్తం ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా అంకిత భావంతో పనిచేయాలన్నారు. ఆర్ఎం భవానీ ప్రసాద్, మంచిర్యాల డిపో మేనేజర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ డీఎం శ్రీలత, అధికారులు పాల్గొన్నారు.



# ఏజెన్సీలో చలించిపోతున్నారు

## గిన్నెదరిలో అత్యల్పంగా 6.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు

**ఆసిఫాబాద్, డిసెంబర్ 29 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత పెరుగుతోంది. గిన్నెదరి ప్రాంతంలో సోమవారం ఉదయం కనిష్టంగా 6.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. రాత్రి నుంచి ఉదయం వరకు తీవ్రమైన చలి ఉండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చలి ప్రభావం మరింత ఎక్కువగా కనిపిస్తోంది. ఉదయం వేళల్లో పొగమంచు కమ్ముకోవడంతో రహదారులపై వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు చలి తీవ్రతతో ఇబ్బంది పడుతున్నారు.